
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 24.04.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 47 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## • ప్రభుత్వంలో
# ప్రయివేట్ పాలన

## ఆ ముగ్గురే కీలకం



ఈస్టిండియా కంపెనీ గురించి భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర చదివిన ప్రతి ఒక్కరికీ తెలిసి ఉంటుంది. భారత దేశానికి వ్యాపారం కోసం వచ్చారు. వ్యాపారం ముసుగులోనే దేశాన్ని ఆక్రమించుకుని పరిపాలన చేసారు. ఆనాటి ఈస్టిండియా వాళ్లు వ్యాపారం కోసం వచ్చి పరిపాలనలోకి జొరబడ్డారు.

ఇప్పుడు మన రాష్ట్రంలో దాదాపు ఇదే తరహా పాలన సాగుతోంది. కాకపోతే ఇక్కడ పరిపాలన కోసం వచ్చిన పాలకులు వ్యాపార దృక్పథంలో మునిగిపోయారు. రాష్ట్రంలో ఒక ప్రజాస్వామ్యబద్ధ ప్రభుత్వం నడుస్తున్నట్లుగా లేదు. ప్రైవేట్ కంపెనీ ఒకటి రాష్ట్రంలో వ్యవహారాలను చూస్తున్నట్లుగా వుంది. ఈ వ్యవహారాలలోనూ వ్యాపార కోణమే ఎక్కువుగా ఉంటుంది.

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసిన ప్రమాణాలలో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు కాలేదు. దీనికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కూడా సహకరించడం లేదన్నది వాస్తవం. విభజనతో అస్తవ్యస్థమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టే దిశగా చంద్రబాబు ఒక్క ప్రయత్నం కూడా చేయలేదు సరికదా, రాష్ట్రానికి మరింత ఆర్థిక భారం మోపుతూ సింగపూర్ రాజధాని అంటూ ఒకటి మొదలుపెట్టాడు. రాష్ట్ర ప్రజలకు ఏది అవసరవో చంద్రబాబు దానిని చేయడం లేదు. తమకు ఏది అవసరమో దాని మీదే దృష్టి పెడుతున్నారు. ప్రజావ్యతిరేకతను లెక్క చేయకుండా వాటినే చేసుకుంటూ పోతున్నారు. రాష్ట్రంలో నడుస్తున్న ప్రైవేట్ కంపెనీకి

(మిగతా 10వ పేజీలో)

## లోకేష్‌కు
# కీలక బాధ్యతలు

లాయర్ కొడుకు లాయర్ కాకపోవచ్చు, డాక్టర్ కూతురు డాక్టర్ అవ్వకపోవచ్చు... రైతు బిడ్డ రైతుగా మారకపోవచ్చు... కాని ఈ దేశంలో సినిమా హీరో కొడుకు సినిమా హీరో అవుతున్నాడు, రాజకీయ నాయకుడు కొడుకు రాజకీయ నాయకుడు అవుతున్నాడు. తండ్రుల వారసత్వం ఈ రెండు రంగాల్లో కొనసాగినట్లుగా ఇంకే రంగంలోనూ కనిపించదు. హీరోల కొడుకులకు టాలెంట్ లేకున్నా, గ్లామర్ లేకపోయినా ముఖానికి పూతలువేసి, ప్లాస్టిక్‌సర్జరీలు చేయించి హీరోలుగా తెరపైకి పంపిస్తారు. రాజకీయ నాయకులూ అంతే... తమ పుత్రరత్నాలకు అంత ప్రావీణ్యం లేకున్నా తమ టాలెంట్‌తో, పరపతితో వారిని యువతరం నేతలుగా తీర్చిదిద్దుతుంటారు.

తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ (మిగతా 10వ పేజీలో)




# నెల్లూరులో నెల్లూరోళ్లు!

చారిత్రాత్మక నగరం నెల్లూరు. సంచలనాత్మక జిల్లా నెల్లూరు జిల్లా. ఎంతోమంది రాజకీయ ఉద్దండులను పారిశ్రామిక ప్రముఖులను, వ్యాపారవేత్తలను, కళాకారులను సాహితీవేత్తలను, పోరాటవీరులను దానకర్ణులని సమాజానికి అందించిన ఘనత ఈ జిల్లాది. అయితే ప్రస్తుతం నెల్లూరుజిల్లా నిరాశతో వుంది. నిరాదరణకు గురికాబడింది. కొన్ని రాజకీయ కారణాలతో నెల్లూరును మూలకు త్రోసేశారన్నది నిర్వివాదాంశం. నెల్లూరును ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నది నెల్లూరీయులందరి ఏకాభిప్రాయం. కావాలనే నెల్లూరును ప్రక్కన బెట్టారన్నది అందరి అనుమానం.

ప్రస్తుతం ఈ అభిప్రాయాలను, అనుమానాలనూ, ఊహాగానాలను పటాపంచలు చేస్తూ "నెల్లూరు నెక్స్ట్" అనే వినూత్న కార్యక్రమంతో నెల్లూరు నగరంతో పాటు జిల్లా అంతా అభివృద్ధి ఫలాలను అందించే ప్రయత్నం చేస్తున్నాడు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి వెంకయ్యనాయుడు. తమ కుమార్తె దీపావెంకట్ సారధ్యంలో నడుస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ స్ఫూర్తితో ఆమె ప్రోద్భలంతో ఈ కార్యక్రమాన్ని ఆయన జరుపుతున్నాడు. దేశవ్యాప్తంగా వున్న నెల్లూరు ప్రముఖులనందరినీ నెల్లూరుకు ఆహ్వానించి ఏప్రియల్ 25వ తేదీ శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకూ గొలగమూడి రోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ "నెల్లూరు నెక్స్ట్" కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాడు.

హైదరాబాదు నుండి జి.వి.కె.రెడ్డి, జి.వి.సంజయ్‌రెడ్డి, తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, జి.వి.ప్రసాద్‌రెడ్డి, బొల్లినేని భాస్కర్‌రావు, కంచర్ల రవీంద్రనాథ్, డా॥ యన్.విష్ణు స్వరూప్‌రెడ్డి, నూకలపాటి పార్వతి, వంశీరామ్ సుబ్బారెడ్డి (మిగతా 10వ పేజీలో)



# రాంగ్‌రూటు కాటేసింది

## • ఆటోని ఢీకొన్న లారీ... నలుగురు దుర్మరణం

రాంగ్‌రూట్‌లో వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టడంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఐదేళ్ళ బాలుడున్నాడు. ఈ ప్రమాదం నెల్లూరుజిల్లా కోవూరు పట్టణంలో సాయిబాబా మందిరం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. దగదర్తి మండలం చవటపుత్తేడు గ్రామానికి చెందిన వేణు ఆటోను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నెల్లూరు నుంచి రాజుపాళెం వెళ్లేందుకు అయిదుగురు ప్రయాణీకులతో సోమవారం మధ్యాహ్నం బయలుదేరారు. వీరి ఆటో కోవూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటి సాయిబాబా మందిరం సమీపంలో వెళ్తున్న సమయంలో ఖాళీలారీ అక్కడి యార్డులోకి వెళ్లేందుకు రాంగ్‌రూట్‌లో ఎదురుగా వస్తూ ఆటోను ఢీకొంది.

ఈ ప్రమాదంలో ఆటో బోల్తాపడి నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న వారు వాహనంలో చిక్కుకుపోయి హాహాకారాలు చేశారు. స్థానికులు వాహనదారులు ఆటోలోని వారిని బయటకు లాగే ప్రయత్నం చేశారు. ఆటోడ్రైవర్ వేణు(27) గుర్తు తెలియని మహిళ(35) అక్కడికక్కడే మృతి చెందారు. కొడవలూరు మండలం ఆలూరుపాడుకు చెందిన దానం, ఐదేళ్ళ బాలుడు దానం మనుమడు ఆసుపత్రిలో మృతిచెందారు. మరో ఇరువురు తీవ్ర గాయాలపాలయ్యారు. సంఘటనా స్థలాన్ని రూరల్ డిఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, సిఐ అశోక్‌వర్ధన్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ వెంకటయ్యను సంఘటనా స్థలంలో పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసుస్టేషన్‌కు తరలించారు.




## మస్తాన్‌బాబుకు సైకత నివాళి

ప్రపంచంలోని పలు ఎత్తైన పర్వతాలను అధిరోహించి, ప్రపంచ ప్రఖ్యాతి పొంది, సాహసయాత్రలోనే మరణించిన మల్లి మస్తాన్‌బాబు మృతి పట్ల చిల్లకూరు మండలానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, ఆ మహా సాహస పర్వతారోహకునికి నివాళిగా అద్భుతమైన సైకత శిల్పాన్ని రూపొందించారు. అందులో మస్తాన్‌బాబు చిత్రాన్ని రూపొందించి, 'హీర్ ఆఫ్ ది మౌంటెన్స్' అని కూడా రాసి మస్తాన్‌బాబుకు నివాళులర్పించారు. ఈ సైకత చిత్రం అందరినీ బాగా ఆకట్టుకుంటోంది.


# పొగాకు రైతులను ఆదుకోవాలి

**ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి**

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పొగాకు పంటకు సరైన రంగు, నాణ్యత లేక, ఆ రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారని, ఆ రైతులను వెంటనే ఆదుకోవాల్సి వుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి అన్నారు. ఈ నెల 18వ తేదిన ఆయన డి.సి పల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో పొగాకు వేలం విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు తమ బాధలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులు నష్టపోకుండా వ్యాపారులు ఆదుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వేలం విధానంలో పాల్గొని, రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే అనేకమంది పొగాకు రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారని ఆయన వివరించారు. డిసి పల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులను వెంటనే కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు ఆదుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి దుర్గాప్రసాద్‌తో పాటు, వైఎస్సార్సీపి జిల్లా అధికారప్రతినిధి మల్లు సుధాకరరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, రైతు సంఘం నాయకులు పి.వెంకటేశ్వరరెడ్డి, కె.శ్రీరాములునాయుడు, వైఎస్సార్సీపి నాయకులు జంగమరెడ్డి, నరసింహులునాయుడు, బి.ఓబుల్‌రెడ్డి, టి. రామచంద్రారెడ్డి, హజరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం



# చంద్రబాబు టూరిస్టు సిఎం

**----------- నల్లపరెడ్డి ప్రసన్న**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ టూర్లలో మునిగి తేలుతున్నారని వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నెల్లూరుజిల్లా కోటలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎక్కువ సమయం విదేశాల్లోనే గడుపుతున్నారన్నారు. సింగపూర్‌కు పోయివచ్చి రాష్ట్రాన్ని సింగపూర్‌లా మారుస్తానంటాడు, చైనా వెళ్లి వచ్చి చైనాలా చేస్తానంటాడు... ఏ ప్రాంతానికి వెళితే ఆ ప్రాంతంలా మారుస్తానని, నిలకడ ప్రణాళికలేని వ్యక్తిలా చంద్రబాబు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. చంద్రబాబు విదేశీ మోజులో పడి ప్రజల్ని కూడా చైనా, జపనీయుల్లా కప్పలు, పాములు తినమని చెబుతాడేమోనంటూ ఎద్దేవా చేశారు. పట్టిసీమ ప్రాజెక్టు పేరుతో తన సొంత వారికి, కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇటీవల శేషాచలం అడవుల్లో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలన్నారు. చంద్రబాబు చేతిలో అన్ని వర్గాల ప్రజలు పలు విధాలుగా మోసపోయారన్నారు.

## ఏఎంసీ చైర్మెన్‌గా రవికుమార్‌రెడ్డి

నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా గతంలో పనిచేసిన రవికుమార్‌రెడ్డి(బాబురెడ్డి) మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రవికుమార్‌రెడ్డి ముత్తుకూరు మండలంలోని ముసునూరువారిపాలెం గ్రామ నివాసి. జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా జరిగిన ఈ నియామకాల్లో, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అనంతసాగరం నివాసి అయిన రాపూరు సుందరరామిరెడ్డి నియమితులయ్యారు. సీనియారిటీ ప్రాతిపదికన ఈ ఇద్దరు నేతలకు టిడిపి అధిష్టానం ప్రాధాన్యత ఇస్తూ ఈ నియామకాలు చేసినట్లు తెలుస్తోంది.

# గ'లీజు' చేయాలనుకున్నారు...

## ఇందిరాభవన్‌ను స్వాధీనం చేయాలని కోరిన ఏఐసిసి, పిసిసి




కీర్తిశేషులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంగ్రెస్ మనిషి. ఆయనలో అణువణువు కాంగ్రెస్ భక్తే కనిపించేది. రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టింది, జీవన ప్రస్థానాన్ని ముగించింది ఆయన కాంగ్రెస్‌పార్టీలోనే! పార్టీ పట్ల భక్తి భావం చూపినందుకు కాంగ్రెస్‌పార్టీ ఆయనకు అన్నీ ఇచ్చింది. అడక్కుండానే ఎమ్మెల్సీ ఇచ్చింది, మంత్రిని చేసింది, పిసిసి పీఠంపై కూర్చోబెట్టింది, అతనే ఊహించని ముఖ్యమంత్రి కుర్చీని కూడా ఇచ్చింది. ఆయనకు కాంగ్రెస్ ఇంత చేసింది. తన జీవితంలో ఆయన కాంగ్రెస్ పార్టీ ఋణం తీర్చుకోవడానికా... అన్నట్లు చేసిన ఒకే ఒక్క మంచి పని ఇందిరా భవన్‌ను కట్టించడం.

అయితే దీనిని కట్టడానికి ఆయన సొంత ఆస్తులేమీ అమ్మ లేదు. స్థలమిచ్చింది ఒకరు, విరాళాలు పోగేసింది కొందరు. అప్పట్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల సమిష్టికృషితోనే ఇందిరాభవన్ కట్టారు. అయితే నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి దీని నిర్వహణ కోసం ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. కేవలం దీని నిర్వహణ కోసం ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. అంతేగాని ఇందిరాభవన్‌ను అమ్మి సొమ్ము చేసుకునే అధికారాలేవీ ట్రస్ట్‌కు దాఖలు చేయలేదు.

గత కొన్ని దశాబ్దాలుగా ఇందిరా భవన్‌లో కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాల కంటే ప్రైవేట్ కార్యక్రమాలు, వ్యాపార కార్యక్రమాలు ఎక్కువుగా జరిగేవి. ఈ వచ్చిన డబ్బుతోనే ఇందిరాభవన్‌పై అంతస్తును కూడా కట్టారు. ఇందిరా భవన్ కాంగ్రెస్ ఆస్తి. కాని దీని రూప శిల్పి మాత్రం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

దీనిమీద నేదురుమల్లి ముద్ర బలంగా ఉండబట్టే ఆనం సోదరులు గతంలో సొంతంగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని అక్కడనుండే తమ కార్యకలాపాలు సాగించారు. జిల్లా కాంగ్రెస్‌లో నేదురుమల్లి వర్గీయులకు మాత్రం ఇందిరాభవన్ ఒక అడ్డాగా ఉండేది. జిల్లా కాంగ్రెస్‌లో ఆనం సోదరుల ప్రాబల్యం పెరిగిన తరుణంలో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ఎక్కడ ఇందిరాభవన్ వాళ్ళ చేతుల్లోకి పోతుందోనని భయపడ్డాడు. ఈ నేపథ్యంలోనే ఇందిరాభవన్ పత్రాలను కొన్నేళ్ళ క్రితమే ఏఐసిసికి అప్పగించారు. తర్వాత ఏఐసిసి దీనిని స్వాధీనం చేసుకోవడానికి న్యాయపరమైన చిక్కులు అడ్డొచ్చాయి. వాటిని పరిష్కరించి భవనాన్ని అప్పగించాలని అప్పట్లోనే ఏఐసిసి కోరింది. అయితే ఆ తర్వాత నేదురుమల్లి స్వర్గస్తులయ్యారు.

ఇప్పుడు కాంగ్రెస్‌కు సంబంధం లేని వాళ్ళు ఇందిరాభవన్ ట్రస్ట్‌లో సభ్యులుగా కొనసాగుతున్నారు. సీనియర్ న్యాయవాది పి.వి.రమణారెడ్డి సిన్సియర్ కాంగ్రెస్‌వాది. కాని ఇప్పుడు వయసు పైబడింది. నేదురుమల్లి తనయుడు రాంకుమార్‌రెడ్డి ఇటీవలే బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌తో ఆయనకు సంబంధాలు తెగిపోయాయి. మరో సభ్యుడికి కూడా కాంగ్రెస్‌తో సంబంధాలు లేవు.

మరి ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ఆస్తి ఇందిరాభవన్‌పై వీళ్ల పెత్తనమేంటనేది జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల వాదన. ఈ ట్రస్ట్ పెత్తనంలోనే ఇందిరాభవన్‌ను 99 ఏళ్ల లీజుకు ఇచ్చే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ వ్యాపారులకు దీనిని 99ఏళ్ల లీజుకిస్తారు. వచ్చిన డబ్బును ట్రస్ట్ ఖాతాలో వేసుకుంటారు. జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాలకు మాత్రం ఇందిరాభవన్‌ను అద్దెలేకుండా ఉచితంగా ఇస్తారు. ఇదీ ట్రస్ట్ సభ్యుల ప్లాన్. దీనిని పసిగట్టే ఆనం సోదరులు కాంగ్రెస్‌పార్టీ ఆస్తి అయిన ఇందిరాభవన్‌ను కాంగ్రెస్ పార్టీకి స్వాధీన పరిచేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆనం వాళ్లు ఒత్తిడి పెంచేసరికి ట్రస్ట్ వాళ్లు కూడా ఎదురుదాడి మొదలుపెట్టారు. వాదనలు, ప్రతివాదనలు, కేసులు, ప్రతి కేసులతో ఇందిరాభవన్ ఇప్పుడు హాట్ హాట్‌గా తయారైంది.

ఎట్టకేలకు ఇందిరాభవన్‌ను స్వాధీనం చేయాలంటూ ఏఐసిసి, పిసిసి ఇరువురూ ట్రస్టును ఆదేశించడంతో... ఇక ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చినట్లేననిపిస్తుంది.




# అంతర్జాతీయ సదస్సులో అనిల్‌కుమార్‌రెడ్డి

అట్టపెట్టెల తయారీలో పేరెన్నికగన్న నెల్లూరీయుడు, చెన్నైలో ఏ తెలుగు కార్యక్రమం జరిగినా ముందుండి నడిపించే సాహితీప్రియుడు, అందరికీ చిరపరిచితుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఈ నెల 13 నుంచి 17వ తేది వరకు చైనాలోని తైపీ, తైవాన్, షాంఘైలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు.

అట్టపెట్టెల తయారీదారుల సంఘాల సమాఖ్యలో ప్రముఖ సేవలందించిన కొర్రుగేటెడ్ బాక్స్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ ఆఫ్ ఇండియా-ఐసిసిఏ మాజీఅధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డికి వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన వెళ్లి ఆ సదస్సులో పాల్గొన్నారు. ఆ సంస్థ ద్వారా ప్రపంచానికి అందిస్తున్న సేవలను ఈ సదస్సులో సమీక్షించుకున్నారు. 1961లో అంతర్జాతీయ స్థాయిలో అట్టపెట్టెల తయారీదారులకు సంబంధించిన సంఘం(ఇంటర్నేషనల్ కొర్రుగేటెడ్ కేస్ అసోసియేషన్)-ఐసిసిఏ ఏర్పడింది. గత మూడు దశాబ్దాలుగా సంఘ సభ్యులందరి సహకారంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ విస్తృతంగా తన సేవలు అందిస్తోన్న నేపథ్యంలో, ఆ సంఘానికి సంబంధించిన ప్రముఖులను ఆయా దేశాల నుంచి ప్రతినిధులుగా ఈ వేదికపైకి ఆహ్వానించారు. అందులో మన దేశం నుంచి అనిల్‌కుమార్‌రెడ్డి ఆ విశిష్టమైన సదస్సులో పాల్గొనడం విశేషం. రెండేళ్ళకొకసారి ఇదేవిధంగా ఐసిసిఏ సదస్సులు నిర్వహిస్తుంటారు. గతంలో 2013లో ప్యారిస్‌లో ఆ సదస్సు జరిగింది. అదేవిధంగా, 2017లో బ్రెజిల్‌లో ఈ సదస్సు జరుగుతుందని ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. చైనాలో ఇటీవల జరిగిన సదస్సులో సంఘాధ్యక్షుడు కార్ల్‌బోమ్ (యుఎస్‌ఏ), ఛైర్మెన్ ఫ్రాంక్ చెంగ్‌లతో పాటు, జోస్ జి సోర్స్ (బ్రెజిల్) తదితర ముఖ్యులు ఈ సదస్సులో పాల్గొన్నారని కూడా అనిల్‌రెడ్డి తెలిపారు.

## విదేశీ వాణిజ్యంపై...
# శ్రీసిటీలో చర్చా గోష్టి




కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1న ప్రవేశపెట్టిన నూతన విదేశీ వాణిజ్య విధానంపై చర్చా గోష్టి 22వతేది శ్రీసిటీలో జరిగింది. డెవలప్మెంట్ కమీషనర్ ఏ.కె.చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ గోష్టిలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, శ్రీసిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నూతన విధానం వల్ల తయారీ మరియు సేవల రంగాలలో మరిన్ని విదేశీ పెట్టుబడులు వస్తాయని, మేక్ ఇన్ ఇండియా విధానం వలన ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చౌదరి వివరించారు. గోష్టిలో పాల్గొన్న వారంతా వివిధ అంశాలపై చర్చించి, తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

# 25న మస్తాన్‌బాబు అంత్యక్రియలు

ప్రపంచంలోని అన్ని ఎత్తైన పర్వతాల మెడలను వంచిన పర్వతారోహకుడు, ఆ పర్వతాల ఒడిలోనే తుదిశ్వాస విడిచిన నెల్లూరు గిరిజన పుత్రుడు మల్లి మస్తాన్‌బాబు ఆఖరిచూపు కోసం జిల్లా ప్రజలు, అభిమానులు ఎదురుచూస్తున్నారు. సరిగ్గా నెలరోజుల క్రితం చిలీలోని ఆండీస్ పర్వతాల్లో సంభవించిన తుఫాన్ కారణంగా మల్లి మస్తాన్‌బాబు మృతి చెందారు. ప్రతికూల వాతావరణం వల్ల ఆయన మృతదేహాన్ని గుర్తించడం, గుర్తించాక కూడా కొండలపై నుండి క్రిందకు తీసుకురావడం ఆలస్యమైంది. అర్జెంటీనా ప్రభుత్వ సహకారంతో ఆయన మిత్రులు శ్రమించి ఎట్టకేలకు మస్తాన్‌బాబు మృతదేహాన్ని కొండలపై నుండి క్రిందకు తీసుకొచ్చారు. భారత ప్రభుత్వం ఆ పర్వతపుత్రుడి మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో 24వ తేదీ సాయంత్రానికి చెన్నై ఎయిర్‌పోర్టుకు తీసుకురానుంది. అక్కడ నుండి రోడ్డు మార్గాన నెల్లూరుజిల్లా సంగం మండలంలోని గాంధీగిరిజన సంఘంకు ఆయన మృతదేహాన్ని చేర్చనున్నారు. 25వతేదీ ఉదయం ప్రభుత్వ లాంఛనాలతో మల్లి మస్తాన్‌బాబు అంత్యక్రియలు నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# ముగిసిన ఆంధ్రమహాభారత ఉపన్యాసాలు



నెల్లూరు పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి 18వ తేదీ వరకు నెల్లూరులోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన ఆంధ్ర మహాభారత ఉపన్యాసాలు వైభవంగా ముగిసాయి. ఈ నాలుగు రోజులు రాజమహేంద్రవరానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపల్, ప్రవచన ప్రభాకర కేశాప్రగడ సత్యనారాయణ అశ్వమేధ పర్వము ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ శ్వాసాలను గురించి సవివరంగా వివరించారు. 15వ తేదీ బుధవారం జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా నెల్లూరు జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ పాల్గొని పద్యం మధురమైనదని, పద్యాలను ఆదరించాల్సిన అవసరముందన్నారు.

ఈ కార్యక్రమాలను పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కోశాధికారి ద్విసహస్రసభాసింహం బి.వి. నరసింహం, సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు పర్యవేక్షించారు. సాహితీవేత్తలు, కళాభిమానులు, సంగీతాభిమానులు విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను, కేశాప్రగడ సత్యనారాయణను సంస్థ సభ్యులు శాలువాలతో పూల మాలలతో సత్కరించారు.

# ఆకట్టుకున్న నేలనూతల స్మారకోపన్యాసం



శ్రీ నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 16వతేదీ సాయంత్రం నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో ప్రముఖ చరిత్ర పరిశోధకులు దివంగత నేలనూతల శ్రీకృష్ణమూర్తి 12వ స్మారకోపన్యాసము జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత చలనచిత్ర విమర్శకులు వి.ఏ.కె. రంగారావు తెలుగు సినిమాలలో సంగీత వికాసం గురించి ఉపన్యసించారు. అనంతరం ఎన్ఎస్‌కె స్మారక సమ్మాననమును స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని అధ్యక్ష కార్యదర్శులు వంటేరు వెంకటకృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ప్రముఖ సాహితీవేత్తలు వేదం వెంకట్రామన్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్, బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, 'లాయర్' వార పత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్ రెడ్డి, వి.యస్.రామచంద్రరావు, డా॥ కాళిదాసు పురుషోత్తం, మెట్టు రామచంద్రప్రసాద్, నేలనూతల శ్రీనివాసమూర్తి, హెచ్ఎస్‌వికె రంగారావు, వల్లకవి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్ కళాశాల ఫిజిక్స్ రీడర్ డా॥ ఎం.సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు.

# 'ప్రభా'తం

పెద్దలు పూరికే అనలేదు.. పండ్లు వున్న చెట్లకే రాళ్లు తగులుతుంటాయని, పరుగులెత్తే గుర్రాన్నే పరుగెత్తిస్తుంటారనీ!... ఇలాంటివన్నీ ఎంతో అనుభవంతో చెప్పిన సామెతలు. ఒక్కోసారి అవెంత నిజమో కదా!.. అని అనిపిస్తుంటుంది కూడా. దేశ రాజకీయాల్లో ఇప్పుడు జరుగుతున్న తంతు కూడా దాదాపు ఇలాగే అనిపిస్తోంది. కుదేలైపోయివున్న దేశ ఆర్థిక వ్యవస్థను ఒక కొలిక్కి తీసుకురావడం, కదలనంటే కదలనని మొరాయిస్తూ కూర్చున్న ప్రగతిబండి చెవి మెలితిప్పి మరీ పరుగులు పెట్టిస్తుండడం, ధనంపై కాక జనంపై మమకారంతో, స్వార్థంతో కాక..అచంచల దేశభక్తితో అటు వీధి వీధినా చెత్తను ప్రక్షాళన చేయడమే కాక, ఎంతో పెద్దదైన గంగానదిని సైతం పరిశుభ్రం చేసి, పరిరక్షించేందుకు శాశ్వత ప్రాతిపదికపై చర్యలు చేపడుతుండడం, దేశపురోగతిని కాంక్షిస్తూ, ఎక్కడ అవకాశం వుంటే ఆ మార్గాన్నల్లా దేశప్రజల సంక్షేమానికే వినియోగించేందుకు అహరహం కృషి చేస్తున్న మోదీ ప్రభుత్వంపైనా విమర్శలు సహజమే. పండ్ల చెట్ల మీదికే రాళ్ళు విసురుతారన్నట్లుగా, పనిచేసేవారిపైనే విమర్శల బాణాలుంటాయి. లేనివారికేమీ లేదు. అయితే, ప్రత్యేకించి పనిగట్టుకుని కాంగ్రెస్ అగ్రనేతలు ప్రధాని మోదీపై చేస్తున్న విమర్శలు మాత్రం విచారకరమే. అందులోనూ, ఏళ్ళ తరబడి దేశాన్ని ఏలిన వారు.. దేశానికి వెన్నెముక అయిన అన్నదాతల సమస్యలను ఏమాత్రం పట్టించుకున్నారో ఇప్పుడు మనం ప్రత్యేకించాల్సిన అవసరమేమీ లేదు. అది వేరే సంగతి. ఎప్పుడో బ్రిటిష్ కాలంనాటి భూసేకరణ చట్టాన్ని అడ్డుపెట్టుకుని, దేశవ్యాప్తంగా అనేక చోట్ల కోట్లాదిరూపాయల విలువైన సుక్షేత్రమైన భూములు సెజ్ పేరుతో కబ్జాల పాలైనా, రైతులు అన్యాయమైపోయి గోడు గోడుమంటున్నా చేష్టలుడిగిపోయి చూస్తూ కూర్చున్నవారు ఇప్పుడిలా మాట్లాడుతుండడమే అందరికీ ఆశ్చర్యం గొలిపే విషయంగా వుంది. ఇలాంటి తప్పులెన్నిటికో పరిహారంగా, గత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కనీవినీ ఎరుగని విధంగా వచ్చిన ప్రజాతీర్పుతో పదవులు ఖాళీచేయాల్సివచ్చినా, ఇంకా పాతబాటలోనే కాంగ్రెస్ ఇలాంటి విమర్శలు చేస్తుండడమే విడ్డూరం. మోదీ ప్రభుత్వంపై ఎంతగా విమర్శలు చేస్తే అంతగా ప్రచారం వస్తుందని భావించారో ఏమో తెలియదు కానీ, ప్రధాని మోదీ పాలనా విధానాల విషయంలో ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న నిర్హేతుకమైన విమర్శలు చూస్తుంటే, దేశాన్ని ఇన్నాళ్లు.. ఇన్నేళ్ళు ఏలిన అనుభవం వున్నవారు మాట్లాడాల్సిన మాటలేనా ఇవి?.. అనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో కార్పొరేట్ సంస్థల నుంచి తీసుకున్న భారీ రుణాలను తిరిగి చెల్లించడానికి ప్రధాని నరేంద్రమోదీ భూసేకరణ బిల్లును తెస్తున్నారని, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు కేంద్రం ఇలాంటి ప్రయత్నాలను చేస్తోందనీ విమర్శిస్తున్న కాంగ్రెస్ నేతల ఆరోపణల్లో ఏపాటి నిజముందో వారికే తెలియాలి. భూములను తేలిగ్గా లాక్కోగలరని గుజరాత్ నమూనా ద్వారా మోదీ రుజువుచేశారని, ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆ పని చేయగలమని పారిశ్రామికవేత్తలను నమ్మించారనీ.. మరో దారుణమైన విమర్శ. అదే జరిగివుంటే, అప్పుడంతా వీరు ఏమిచేస్తున్నట్టు?..అదేదో అప్పుడే అడిగివుండవచ్చు కదా?.. ఇవన్నీ చూస్తుంటే, ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న భూసేకరణ చట్టసవరణ బిల్లు.. కాంగ్రెస్ నేతలకు ఇప్పుడు సరికొత్తగా..విమర్శనాస్త్రాలకు కొత్త అమ్ములపొదిగా మారిందేమో అనిపిస్తోంది. వాస్తవానికి, ఇప్పు డున్న భూసేకరణ చట్టం వల్ల వేలాది కోట్ల రూపాయల ప్రాజెక్టుల నిర్మాణాలు ఎటూ తేలని సందిగ్ధావస్థలో వున్నాయి. ముఖ్యంగా రోడ్లు, రైల్వే లైన్ల నిర్మాణాలు, కొత్త పరిశ్రమల స్థాపన వంటి ఏ కార్యం చేపట్టాలన్నా భూములు ఎంతో అవసరం. ప్రభుత్వానికి ప్రజలూ అవసరం.. ప్రగతీ అవసరం. అయితే, ఆ భూముల సేకరణ రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరగాలన్నదే అందరి అభిప్రాయం. చట్ట సవరణల విషయంలోనూ రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలుగకుండా చూడాలి. పంటలు పుష్కలంగా పండే భూములు కాకుండా, ఇతరత్రా వున్న భూములను వాటికి వినియోగించుకోవాలి. ఒకవేళ తప్పనిసరైన పరిస్థితుల్లో రైతులు బాగా సంతోషించేవిధంగా పరిహారం వుండాలే తప్ప, వారి పొట్టకొట్టి భూములు లాక్కోవడాన్ని ఎవరూ సమర్థించరు..హర్షించరన్నది జగద్విదితం. ఏదైతే రైతుల ప్రయోజనాలకు దెబ్బలేకుండా, అన్నదాతలకు అన్ని విధాలా శ్రేయోదాయకంగా వుంటుందో అలాంటి వాటికే ప్రజల మద్దతు కూడా వుంటుందని గుర్తుంచుకోవాలి. అలా కాకుండా, చిత్తం వచ్చిన రీతిలో చట్టాలు, సవరణలు చేసేస్తామంటే చివరికవి ఆశించిన సత్ఫలితాలివ్వవన్నది విజ్ఞులు, అనుభవజ్ఞులు.. అందులోనూ రాజనీతిజ్ఞులైన వారందరికీ తెలిసిందే. ఎవరైనా ఇక్కడ చేయాల్సింది విమర్శలు కాదు.. సూచనలు. కోరాల్సిందల్లా.. సరైన సవరణలు.. అంటే, భూసేక రణకు సంబంధించి రైతులకు మేలు చేకూర్చే సవరణలకే పట్టుబట్టాలి తప్ప, అసలు విషయాన్ని పక్కదారి పట్టించేవిధంగా విమర్శలు చేయడం వల్ల చివరికి జరిగేదీ, ఒరిగేదీ ఏమీ వుండదు. లేనిపోని విమర్శల వల్లనో, లేదా నిందారోపణలు మోపడం వల్లనో ఏమీ సాధించలేం. ఇప్పటికే అనేక సమస్యల వలయంలో వున్న దేశం..ఆ సమస్యలన్నిటినీ ఒక్కొక్కటిగా అధిగమించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నది సామాన్యునికైనా అర్థమయ్యే విషయం. దేశం ఆర్థికంగా, సామాజికంగా ఎంతో పురోగతిని సాధించాల్సి వుంది. అందుకు, మనవంతు మంచి సూచనలు, సలహాలు ఇవ్వడం అందరి కర్తవ్యం. మాటలు చెప్పడం వేరు..ఆచరించడం వేరు. ఈ రెండిం టికీ సమన్వయం కుదిరిన నాడే చెప్పిన మాటలు ఆచరణలోకి వస్తాయి. వారైనా, వీరైనా.. నేతలన్నవారు ఎవరైనా చేయాల్సింది ఇదే. అయినా, చెప్పిన మాటలు.. ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రయత్నించేవారిపై ఆరోపణలు వస్తూండడం సహజం. నాయకులన్నవారు సమస్యలను అధిగమించినట్లు, విమర్శలను కూడా అదే స్ఫూర్తితో అధిగమించాలి. అన్నిటినీ చిరునవ్వుతోనే అధిగమించి, దేశప్రగతే ధ్యేయంగా ముందడుగువేస్తూ, అదే లక్ష్యంతో సాగిపోవడమే ధీరోదాత్త నేత లక్షణం. ప్రధాని నరేంద్ర మోదీకి ఆ లక్షణం నిండుగా.. మెండుగానే వుందని భావిద్దాం!...

## రైతు ప్రగతే ధ్యేయం



భూసేకరణకు సంబంధించి రైతులకు మేలు చేకూర్చే సవరణలకే పట్టుబట్టాలి తప్ప, అసలు విషయాన్ని పక్కదారిపట్టించేవిధంగా కాంగ్రెస్ నేతలు లేనిపోని నిందారోపణలు చేయడం విచారకరం. అలాంటి విమర్శల వల్ల సాధించేదేమీ వుండదు. ఎవరైనాసరే రైతుల సంక్షేమాన్ని కాంక్షించి మంచి సూచనలు ఇవ్వాలే తప్ప, పనిగట్టుకుని విమర్శలు చేసినందువల్ల సాధించేదేమీ వుండదు. అయినా, సమస్యలనే కాదు.. విమర్శలను సైతం అధిగమించి, దేశపురోగతి లక్ష్యాన్ని సాధించడమే ధీరోదాత్త నేత లక్షణం. ప్రధాని మోదీకి ఆ లక్షణం తొలినుంచీ పుష్కలంగానే వుందనేది అందరికీ తెలిసిందే!..

## తడ పోలీసులకు అభినందన



ఇటీవల తడ రైల్వేస్టేషన్‌లో అర్ధరాత్రి కత్తితో బెదిరించి ఓ వివాహితపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడిని పట్టుకున్న బీట్‌కానిస్టేబుల్స్ జి.వెంకటకృష్ణయ్య, ఎస్.కె.జమీర్‌లను జిల్లా ఎస్పీ గజరావ్ భూపాల్ ఈ నెల 21వ తేదీన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. సంఘటన జరిగిన రోజు రాత్రి సుమారు 3కిలోమీటర్లు చీకటిలో ముద్దాయిని వెంబడించి జామాయిల్ తోటల్లో పట్టుకున్నారని, ఇది సాహసవంతమైన చర్య అని, పోలీసులు ఇలా ధైర్య సాహసాలతో పనిచేయాలని ఎస్పీ కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీలు పోతురాజు, బి.వి.రామారావులు కూడా పాల్గొన్నారు.

## రూ.15వేలు నష్టపరిహారం

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.15వేలు నష్ట పరిహారాన్ని ప్రకటించిందని వ్యవసాయ శాఖ జెడి వేణుకృష్ణ తెలిపారు. నెల్లూరు జిల్లాలో సుమారు 2578 హెక్టార్లలో వరి, 24హెక్టార్లలో వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టాన్ని అంచనా వేసేందుకు తహశీల్దారు, వీఆర్వో ఏఓ, ఏఈవోలతో కూడిన 18 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఎన్జీఓ కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు దర్గామిట్టలోని ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం ఏపీ ఎన్జీఓ నగర శాఖ కో-ఆప్షన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా పులి సతీష్‌బాబు(వైద్య ఆరోగ్య శాఖ), అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.రాజేంద్రప్రసాద్(విద్యశాఖ), నగర కార్య దర్శిగా వి.మాలకొండయ్య(పోలీస్ మినిస్టీరియల్ విభాగం), కోశాధికారిగా జి.మాధవయ్య (పశు సంవర్ధక శాఖ), ఉపాధ్యక్షులుగా ఎస్.నాగరాజు(వైద్య ఆరోగ్య శాఖ), ఏ.భాను ప్రకాష్(కలెక్టరేట్), నగర నిర్వహణ కార్యదర్శిగా రమేష్ బాబు(ఇరిగేషన్), సీఈసీ సభ్యులుగా ఎన్.పెంచలయ్య(జిల్లా పరిషత్), ఆర్.జయరాజ్(వ్యవసాయ శాఖ)లను ఎన్నుకున్నారు. వీరిని జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు సిహెచ్‌వీఆర్‌సీ శేఖర్‌రావు కార్యదర్శి వై.రమణారెడ్డి తదితరులు అభినందించారు.

## స్కూలు వ్యానును ఢీకొన్న లారీ

నెల్లూరుజిల్లా పెళ్ళకూరు మండలం భీమవరం వద్ద జాతీయ రహదారిపై స్కూలు వ్యానును లారీ ఢీకొట్టింది. 18వ తేదీ సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా మరో 15మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు చిల్లకూరు రాజమాతాదేవి పాఠశాలకు చెందిన పాఠశాల బస్సు జాతీయ రహదారి మీదుగా వెళుతూ భీమవరం గ్రామంలోకి మలుపు తిరుగుతుండగా సిలికా లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు పక్కనే రోడ్డుపై బోల్తా పడింది. నాయుడుపేట ఎస్సై ఆంజనేయరెడ్డి, సిఐ రత్తయ్య, ఎంవిఐ జాకీర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బలవంతపు పన్నుల వసూళ్లు




నెల్లూరు నగరపాలక సంస్థ వారు నగరంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా మున్సిపల్ పన్నులు వాటి బకాయిలు వసూళ్లు చేయడం హర్షించ దగినదే. కాని అందుకుగాను శాస్త్రీయమైన సర్వే నిర్వహించడం లేదు. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, డ్రైనేజీ పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, ఇంకా వసూళ్లు చేయవలసి వుంది. ఉదాహరణకు ఆస్తి పన్ను చెల్లించేవారిలో చాలామందికి అక్రమ కుళాయి కనెక్షన్లు, డ్రైనేజీ సౌకర్యాలు కలిగివున్నారు. వారిలో చాలామంది మోటార్లు కూడా వినియోగించుకుంటున్నారు. అవి నమోదు కాలేదు. తత్ఫలితంగా అలాంటి నివాసితులు కుళాయి పన్నులు, డ్రైనేజీ పన్నులు, మున్సిపల్ రిజిష్టర్లలో అసైన్‌మెంట్ నంబరు నమోదు గాక వసూళ్లు జరుగుట లేదు. అక్రమ కుళాయి, డ్రైనేజి కనెక్షన్లకు సరైన సర్వే నిర్వహించబడనందున చాలామంది నివాసితులు పన్నులు చెల్లించడం లేదు. పన్నుల వసూళ్లు నిజాయితీగా, పారదర్శకంగా ఉండాలి. విమర్శలకు తావుండరాదు. కుళాయి, డ్రైనేజీ పన్నులు కొన్ని మొండి బకాయిలు కానప్పటికి అధికారులు, సిబ్బంది వారి కనెక్షన్లు తీసివేస్తామని హెచ్చరించి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇది మిక్కిలి శోచనీయము.

**- ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

## కూలీలను చంపడం ఏం న్యాయం

స్మగ్లర్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 20మంది కూలీలను ఎన్‌కౌంటర్‌లో చంపడం ఎంతవరకు న్యాయం. కరుడుగట్టిన నేరస్తులు జైళ్లలో వున్నారు. లేదంటే బయట తిరుగుతున్నారు. అలాంటి వాళ్లను ఎన్‌కౌంటర్‌లు చేస్తే ప్రజలు ఆనందిస్తారు. పొట్టకూటి కోసం స్మగ్లర్ల ప్రలోభాలకు లొంగి వచ్చిన కూలీలను చంపితే ఏం లాభం. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే స్మగ్లర్లను ఎన్‌కౌంటర్ చేయాలి.

**- బి.వి.రెడ్డి, తిరుపతి.**

## రాష్ట్రానికి దరిద్రం పట్టింది

రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు శనిపడితే చంద్రబాబు పాలనతో దరిద్రం పట్టినట్లయ్యింది. చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి పనిచేయడం లేదు. కేవలం అందమైన రాజధాని ఒక్కటే ఆయన కలగా మారింది. ప్రజలు, రైతుల బ్రతుకుల గురించి ఆయనకు పట్టడం లేదు. పరిపాలనా సంబంధమైన మిగతా విషయాలను గాలికొదిలేయడంతో ప్రజల చావు వర్ణనాతీతం.

**బి.రమేష్, నెల్లూరు.**

# మేయర్ ఎవరు?

**అజీజా... ఆనం వెంకటరమణారెడ్డా?**



నెల్లూరుజిల్లా రాజకీయాలలో ఆనం కుటుంబానికి వున్నంత సుధీర్ఘ కాల చరిత్ర, రాజకీయాలలోకి ఈ కుటుంబం నుండి వచ్చినంత మంది ఇంకే రాజకీయ కుటుంబం లోనూ వుండరు. రాజకీయాలలో ఆనంకు బ్రాండ్ ఇమేజ్ వుంది. వై.యస్.రాజశేఖర రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వంటి వారి అనుచరులుగా మసలుకున్నారు తప్పితే రాష్ట్ర రాజకీయాలలో ఇతర రాష్ట్ర స్థాయి నాయకులను కూడా లెక్కచేసిన వాళ్లు కాదు. అలాంటి కుటుంబానికి చెందిన ఆనం వెంకటరమణారెడ్డి ఇప్పుడు నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌కు అనుచరుడుగా, చూసేవారికి అతనికి పిఏ మాదిరిగా పనిచేస్తుండడం చూసి నవ్వుకుంటున్నారు. ఆనం వంశ ఖ్యాతి అంటే ఇదేనా అని ఎద్దేవా చేస్తున్నారు.


ఆనం వెంకటరమణారెడ్డికి సొంత రాజకీయ నేపథ్యం వుంది. నెల్లూరుజిల్లా చరిత్రపై చెరగని ముద్రవేసుకున్న స్వర్గీయ ఏ.సి. సుబ్బారెడ్డికి సొంత మనుమడు ఈయన. అందరి చేత పెద్ద మనిషి అనిపించుకున్న ఆనం భక్తవత్సల రెడ్డి కొడుకు. ఈయనకు సొంతంగా కొంత రాజకీయ చరిత్ర వుంది. కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలోకి, అక్కడ నుండి ప్రజా రాజ్యంలోకి జంప్ చేసి ప్రస్తుతం తెలుగు దేశంలో ఉంటున్నాడు. 2009 ఎన్నికల్లో నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం నుండి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీచేసి తన చిన్నాన ఆనం వివేకానందరెడ్డిని ఓడించినంత పని చేశాడు.

రాజకీయంగా తనకంటూ ఒకస్థాయి వుండి కూడా అతను అజీజ్ వెనుక ఓ పిఏలాగా తిరగడాన్ని ఆనం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. అజీజ్‌తో స్నేహం వేరు... స్నేహం వున్నంత మాత్రాన మేయర్ వెనుక తోకలా తిరగాల్సిన పనిలేదు. కాని కార్పొరేషన్ వ్యవహారాలలో అజీజ్ కంటే ఆనం వెంకటరమణారెడ్డి ఎక్కువ వేలు పెడుతున్నాడు. అధికారికంగా అజీజ్ మేయర్. కార్పొరేషన్ అధికారులను, సిబ్బందిని ఆయన ఆదేశించవచ్చు. పని చేయకుంటే మంద లించవచ్చు. కాని అజీజ్ కంటే ఆనం వెంకటరమణారెడ్డి సిబ్బందిపై ఎక్కువగా నోరు పారేసుకుంటున్నాడు. ఇది కార్పొరేషన్ సిబ్బందికి మింగుడుపడడం లేదు. అసలు ఆయనకేం అధికారం వుందని కార్పొరేషన్ వ్యవహారాలలో కలుగజేసు కుంటున్నాడని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఈమధ్య ఆయన చిన్నాన్న ఆనం వివేకా నందరెడ్డి కూడా తన అబ్బాయి ఆనం వెంకట రమణారెడ్డిని అజీజ్ వెనుక వుండడం చూసి తెగ బాధపడుతున్నాడు. వీడికి ఇంత ఖర్మ ఎం దుకు? శుద్ధంగా వాడి పనులు వాడు చేసుకుంటూ గౌరవంగా ఉండొచ్చు కదా అంటున్నాడు.











• నెల్లూరుకి

# కదలివచ్చిన కూచిపూడి వైభవం

## ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యం - వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యం



ఏప్రియల్ 18వ తేదీ నెల్లూరు కళా రంగంలో ఓ అరుదైనరోజుగా నిలిచిపోయింది. దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన కూచిపూడి కళాకారులంతా ఒక్క చోట చేరి ఉదయం 10గంటల నుండి రాత్రి 8గంటల వరకూ నెల్లూరు కళాభిమానులను అలరించి పుల కింపజేశారు. "కూచిపూడి కళావైభవం" పేరుతో ప్రపంచ తెలుగు సమాఖ్య ఈ అరుదైన అపురూప వేడుకకు నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌ని వేదిక చేసింది. ఉదయం 9గంటలకు ఇస్కాన్ మందిరం నెల్లూరుశాఖ వారి భజనతో ప్రారంభమైన ఈ సంబరంలో 'పూర్వరంగం' కూచిపూడి సాంప్రదాయ ఆరంభంతో కూచిపూడి నాట్యకళా వైభవానికి నాంది గావించారు. అనంతరం జరిగిన సభా వేడుక ఓ అరగంటసేపు కొనసాగగా "కలాపములతో" సుప్రసిద్ధ నాట్యాచార్యులు పసుమర్తి కేశవప్రసాద్ చేసిన ప్రదర్శనపూర్వక ప్రసంగంతో తిరిగి ప్రారంభమైన "కూచిపూడి నాట్య కళావైభవం" నిరంతరాయంగా మొదటివిడత మధ్యాహ్నం 1.30గంటల వరకూ జరిగింది. సిహెచ్ అజయ్‌కుమార్ బృందం ప్రదర్శించిన భామాకలాపం, డా॥ వేదాంతం రామలింగశాస్త్రిచే నృత్య నాటకముల సోదాహరణ ప్రసంగం, నాట్యాచార్యులు కళాకృష్ణ చేసిన మరో ప్రదర్శన పూర్వక ప్రసంగం "పేరిణీ" అనంతరం జరిగిన పేరిణీ శివతాండవం నృత్యం, ప్రముఖగాయని యస్.జానకి కోడలు కైలాంమణి ఉమాభారతి చేసిన "సింహనందిని" కళాభిమానుల కరతాళ ప్రశంసలను అందుకున్నాయి.

మధ్యాహ్నం భోజన విరామ అనంతరం 3గంటలకు తిరిగి ప్రారంభమైన ఈ కళావైభవంలో కళాకృష్ణ బృందం చేసిన 'సాంప్రదాయ నాట్యాలు', భాగవతుల సేతురామ్, డాక్టర్ వనజాఉదయ్ చేసిన "ఏకపాత్ర కేళికలు" ప్రదర్శనాపూర్వక ప్రసంగాలు, శ్రీమతి సునందప్రశాంత్, కుమారి సింధూరమూర్తి, శ్రీమతి నదియా ప్రదర్శించిన "ఏకపాత్ర కేళికల నృత్యాలు" వేదాంత రాధేశ్యామ్ చేసిన యక్షగానాలు ప్రసంగంతో పాటు వారి బృందం ప్రదర్శించిన భక్తప్రహ్లాద ఆద్యంతం అందరినీ ఆకర్షించాయి. చివరగా భాగవతుల సేతురామ్, వనజా ఉదయ్ వారి బృందం ప్రదర్శించిన "గిరిజా కల్యాణం" నృత్యనాటకం ఈ కార్యక్ర మంలో ఆకర్షణగా నిలిచింది. రాత్రి 8గంట లకు మంగళంతో ఈ కళావైభవం ముగిసింది. మొట్టమొదటి సారిగా "కూచిపూడి నాట్యకళా వైభవం" నెల్లూరులో జరగడంతో నాట్యాభి మానులు నాట్యకళాకారులు అధిక సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు. ఎక్కువమంది చిన్నారులకు పరీక్షల కాలం కావడంతో ద్వితీయార్థంలో ఆశించిన మేరకు జనం రాలేదు. అయితే కార్యక్రమాలన్నీ అతిఅరుదైనవి, కళాకారులంతా ప్రముఖులు కావడంతో కూచిపూడి పట్ల అభిమానం కలిగిన ఎక్కువశాతం మంది ఉదయం నుండి రాత్రి వరకు విపిఆర్ కన్వెన్షన్‌సెంటర్ ప్రాంగణంలోనే వుండి పోవడం విశేషం. "ప్రపంచ తెలుగు సమాఖ్య" ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సమాఖ్య ఉపాధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ విపిఆర్ మైనింగ్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించారు.



**సభా సంరంభం:**

భారీ ఏర్పాట్లతో తొలిసారిగా నెల్లూరులో ఏర్పాటు చేసిన "కూచిపూడి నాట్యకళా వైభవాన్ని" రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రపంచ తెలుగు సమాఖ్య చేస్తున్న కళాసేవను మంత్రి అభినందించాడు. ప్రభుత్వం తరపు నుండి కూచిపూడి నాట్యాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానన్నాడు. సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరాదత్‌ని ఈ వేదికపైన మంత్రి సత్కరించారు. సమాఖ్య సాంస్కృతిక కమిటీ ఛైర్మెన్ పి.వి.సాయి వ్యాఖ్యానంతో జరిగిన ఈ మొత్తం వేడుకలో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, వైస్‌ఛైర్మెన్ వి.హజరత్‌బాబు, సభ్యులు ఆదిశేషయ్య, శ్రీనివాస్, శ్రీమతి మంజులతలు పాల్గొన్నారు.

**వి.పి.ఆర్. పుట్టినరోజు :**




ఏప్రియల్ 19న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం కావడంతో ఆయన అభిమానులు ఈ సందర్భంగా ఆయన పుట్టినరోజు వేడుకను ఇదే వేదికపైన ఓరోజు ముందే జరుపుకున్నారు. తన ఆత్మీయులతో పాటు కన్వెన్షన్ సెంటర్‌లో పనిచేసే వందలాదిమంది కార్మికుల నడుమ ప్రభాకర్‌రెడ్డి కేక్ కట్‌చేసి తన జన్మదినాన్ని జరుపుకున్నారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లాంటి దానగుణం కలిగిన వ్యక్తులు బహు అరుదుగా వుంటారని అన్నాడు. ఇలాంటి మహనీయుడు నెల్లూరుజిల్లాలో జన్మించడం నెల్లూరు సేవారంగం చేసుకున్న అదృష్టంగా అభివర్ణించాడు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, కళాకారులు, ఆహూతులు ప్రభాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**నోరూరించిన రుచులు :**



"కూచిపూడి నాట్య కళా వైభవం" సందర్భంగా కార్యక్రమం వీక్షించడానికి వచ్చిన దాదాపు 1300మందికి పంచభక్ష్య పరమాన్నా లతో కూడిన భోజనం వడ్డించారు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నిర్వాహకులు. బఫే పద్ధతి కాకుండా బంతి భోజనం పెట్టి అందరికీ అడిగి మరీ పరిపూర్ణ భోజనాన్ని వడ్డించడం అందరినీ సంతృప్తి పరచింది. ఉదయం నుండి రాత్రి వరకు ఎక్కడా ఎలాంటి లోటు రానీయకుండా కార్యక్రమం ఆద్యంతం ఆనంద భరితంగా నిర్వహించిన ప్రతిఒక్కరూ అభినందనీయులే.

# నెల్లూరు కబుర్లు



## చంద్రబాబు రాక

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 25వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆరోజు వాకాడు మండలంలోని తూపిలిపాలెం వద్ద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ వారు నెలకొల్పనున్న సునామీ పరిశోధన కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది.

## చెత్తతోట చెయ్యొద్దు

**- ఆనం వివేకా**



మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నెల్లూరు నగరంలో ఇష్టపడే ప్రాంతాలలో బోడిగాడితోట ఒకటి. సోమవారం ఆయన బోడిగాడితోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా వున్న చెత్తాచెదారాన్నంతా తొలగించాలని, ఇక్కడున్న డంపింగ్‌యార్డ్‌ను దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తాచెదారాన్నంతా బోడిగాడి తోట వద్ద డంపింగ్ చేస్తున్నారని, దీంతో ఇక్కడ నివాసం వుంటున్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అంటూ, తమ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు ఎంతో పరిశుభ్రంగా వుంచేలా చర్యలు తీసుకుంటూ వుండేవారమని అన్నారు. హిందూ శ్మశానవాటిక పవిత్ర స్థలమని, దీనిని చెత్తతో నింపొద్దని, డంపింగ్ యార్డ్‌ను ఇంకోచోట ఏర్పాటు చేయాలని ఆయన నగరపాలక సంస్థ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ.సి సుబ్బారెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, బర్నాబాసు, నాగమ్మ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మాగుంట శరత్‌చంద్రారెడ్డి

## జన్మదిన వేడుకలు



నెల్లూరు నగరంలోని మాగుంట శరత్‌చంద్రారెడ్డి జన్మదిన వేడుకలు బలిజపాళెంలో ఇటీవల జరిగాయి. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. అలాగే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి యూత్ నిషాంత్ మాట్లాడుతూ పేదలకు చేయూతనిస్తూ వారి అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్న శరత్ చంద్రారెడ్డి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ఇలాగే ఎన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ నిరుపేదలకు అండగా నిలవాలన్నారు. అనంతరం కేక్ కట్టింగ్ చేసి పంచిపెట్టారు. శరత్‌చంద్రారెడ్డి మిత్రులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వివేకాను బహిష్కరించాలంట!

జిల్లా కాంగ్రెస్‌పార్టీలో కొందరు పార్ట్‌టైం లీడర్లున్నారు. వీళ్లంతా ఎన్నికల సమయంలో కనిపిస్తుంటారు. అది కూడా మొన్నటి దాకా నేదురుమల్లి వర్గంలో ఉండేవాళ్లు. ఇప్పుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి బీజేపీలో చేరారు. కాబట్టి వీళ్లు ఏ పార్టీ అనేది డిసైడ్ కాలేదు. కాని వీళ్లంతా కాంగ్రెస్‌పార్టీ నుండి పిసిసి ఉపాధ్యక్షుడు ఆనం వివేకానందరెడ్డిని బహిష్కరించాలంటూ ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీకి, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డికి వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మేం పాతికేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డామని, తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి లాఠీ దెబ్బలు కూడా తిన్నామని, మాలాంటి నిఖార్సయిన కార్యకర్తలు వివేకా వల్ల మన స్థాపం చెందుతున్నారని వాళ్లు ఆ ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది. ఏ పార్టీలో వున్నారో తెలియని వీళ్లు కాంగ్రెస్ నుండి వివేకాను బహిష్కరించాలంటూ సోనియాకు లేఖ వ్రాయడం విచిత్రంగా వుంది.

## నెల్లూరు ఆర్డీఓ మారాడు

నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను హైదరాబాద్ సెక్రటిరియేట్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఆయన స్థానంలో కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు సమీప బంధువు కె.వెంకటేశ్వర్లును నియమించారు. వెంకటేశ్వర్లుది కూడా వెంకటాచలం మండలం చవటపాలెమే! వెంకయ్యనాయుడి ఊరు కూడా ఇదే! పినాకిని గ్రామీణ బ్యాంకులో 1986 నుండి 90వరకు మేనేజర్‌గా పనిచేశాడు. 1990లో రెవెన్యూ శాఖకు ఎంపికయ్యారు. తహశీల్దార్‌గా ఎక్కువ కాలం తెలంగాణలోనే పనిచేశారు. పదోన్నతి మీద ఖమ్మంలో డ్వామా పిడిగా, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, కరీంనగర్‌జిల్లా పెద్దపల్లి, ఖమ్మం జిల్లా భద్రాచలంతో పాటు హైదరాబాద్‌లో కూడా ఆర్డీఓగా ఇతర హోదాలలో పనిచేశారు. ఉద్యోగుల విభజనలో ఆయన ఏపికి కేటాయించబడ్డారు. ఇప్పుడు వెంకయ్య ఆశీస్సులు బలంగా ఉండబట్టి సొంత జిల్లా, అది కూడా సొంత డివిజన్‌కే ఆర్డీఓగా రాగలిగారు.

## మండుతున్న సూర్యుడు

సూర్యుడు మండిపోతున్నట్లుగా ఎండలు కాస్తున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్నాయి. పెరిగే ఎండలను తట్టుకోవడం జనానికి కష్టంగా మారుతోంది. ఉదయం 6గంటలకే సూర్యుడు నిప్పులు కక్కుతూ వస్తున్నాడు. 10గంటలు దాటాక రోడ్ల మీద తిరగాలంటే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఏప్రిల్‌లోనే ఇలా వుంది. ఇక మే నెలలో అడుగు పెట్టబోతున్నాం, రోళ్లు పగిలే రోహిణి కార్తె రాబోతుంది. మేనెలలో ఎండలను ఊహించుకుంటేనే భయమేస్తుంది.

### 27న రానున్న

## పబ్లిక్ అకౌంట్స్ కమిటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఈ నెల 27న జిల్లాలో పర్యటించనుంది. 25వ తేదీన ఈ కమిటీ పర్యటన ఉన్నప్పటికీ అదేరోజు జిల్లాలో సిఎం చంద్రబాబు పర్యటన ఉండడంతో 27వ తేదీకి వాయిదా పడింది. ఈ కమిటీ ఛైర్మెన్ భూమా నాగిరెడ్డి ఆధ్వర్యంలోని 10మంది సభ్యులు తోట త్రిమూర్తులు, పిజివిఆర్ నాయుడు, బి.కె.పార్థసారథి, వై.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, పి.విష్ణుకుమార్‌రాజు, ఎ.సురేష్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పి.శమంతకమణి, ఎంవిఎన్ శర్మ ఈ పర్యటనలో పాల్గొంటారు.

## చిత్రలేఖన పోటీల్లో రత్నాలు



నెల్లూరు బాలభవన్ వారి ఆధ్వర్యంలో 'వరల్డ్ ఎర్త్‌డే' సందర్భంగా శ్రీ కస్తూరిభా కళాక్షేత్రం నందు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో డా॥ కిషోర్స్ రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ విద్యార్థులు పాల్గొని బహుమతులు కైవసం చేసుకున్నారు. 7వ తరగతికి చెందిన పి.వర్షిణి మొదటి బహుమతి, 8వ తరగతికి చెందిన కె.శీర్షిక ద్వితీయ బహుమతి, 9వ తరగతికి చెందిన జి.వి.జె.నితిన్ మూడవ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పి.వర్షిణి, కె.శీర్షిక, జి.వి.జె.నితన్ వాళ్ల తల్లిదండ్రులకు డైరెక్టర్స్ డా॥ కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్ అభినందనలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం పాఠశాలల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లూరులో బాబు బర్త్‌డే




చంద్రబాబు బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 65వ జన్మదిన వేడుకలు సోమవారం నెల్లూరు నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు మహిళ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు చొరవతో నెల్లూరు నగరానికి భూగర్భ డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. తెలుగుదేశంపార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగరమేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముందు నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, జడ్.శివప్రసాద్, మండవ రామయ్య, కిన్నెర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఇంకా పలుచోట్ల తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు చంద్రబాబు జన్మదిన సంబరాలను జరుపుకున్నారు.

## శిల్పారామం పనులు ఆపండి

నెల్లూరు నగర శివారు బుజబుజనెల్లూరు చెరువులో చేపట్టిన శిల్పారామం నిర్మాణం పనులను నిలుపుదల చేయాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి నిర్మాణాలు జరుపరాదని స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణ్‌జ్యోతిసేన్ గుప్తా, జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. లింగాలచెరువులో చేపట్టిన శిల్పారామం పనులను సవాలు చేస్తూ బి.హరికృష్ణ అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం చెరువులో నిర్మాణ పనులను చేపట్టడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

## మాగుంట లే అవుట్‌లో దొంగల బీభత్సం

నెల్లూరు మాగుంట లే అవుట్‌లో ఈనెల 18వతేదీ ఓ ఇంట్లో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటి యజమానిపై మారణాయుధాలతో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు మాగుంట నగర్ ఎస్.ఆర్.కె.స్కూలు వెనుకవైపు రెండవ క్రాస్‌రోడ్డులో నివాసం వుండే అల్లి నారాయణరావు, మృణాళిని దంపతులు 15ఏళ్లుగా కాపురముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి పెద్ద కుమార్తె శిరీష కేరళలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. యుఎస్‌ఏలో ఉన్నత చదువులు చదువుకునేందుకు వారంరోజుల క్రిందట తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఆదివారం ఆమె యుఎస్‌ఏకు వెళ్ళాల్సి వుంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి శిరీషా తన తల్లితో కలసి కింద నిద్రపోగా తండ్రి పైభాగంలోని పడకగదిలో నిద్రించారు. అర్థరాత్రి సమయంలో నలుగురు దుండగులు ఇంటి వెనుక ఉత్తరంవైపు తలుపు స్క్రూలు తొలగించి లోనికి ప్రవేశించి క్రింది భాగం గదిలో నగదు ఆభరణాల కోసం చూసి కనిపించకపోవడంతో మిద్దె పైభాగానికి చేరుకుని నారాయణరావు నిద్రిస్తున్న గదిలోకి వెళ్లి అతనిని నిద్రలేపి నగదు, ఆభరణాలు కావాలని నిలదీశారు. అతను సమాధానం చెప్పకపోవడంతో అతనిపై రాడ్‌లతో దాడి చేశారు. ప్రాణభయంతో నారాయణరావు పెద్దగా కేకలు వేయడంతో కింది గదిలో నిద్రిస్తున్న భార్య, కుమార్తెలు పైకి వచ్చి దుండగులను అటకాయించడంతో వారిని వదిలేసి వెనుకవైపునున్న ప్రహరి దూకి రైలుపట్టాల పైకి వెళ్లిపోయారు. గాయాలపాలైన నారాయణరావును కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జయభారత్ హాస్పిటల్‌కు తరలించారు. నాల్గవనగర ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావు, ఎస్సై గిరిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## నేదురుమల్లి కుటుంబం మధ్య వార్

# వీధిలో విద్యాసంస్థ



*జిల్లాలో విశ్వోదయ, వీఆర్‌సి, ఎన్‌బికెఆర్... పేరెన్నిక గన్న విద్యా సంస్థలు. వీఆర్ సంస్థలు నెల్లూరు, విశ్వోదయ విద్యాసంస్థలు కావలి వంటి పట్టణాల్లో ఉన్నాయి. కాని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలు పల్లెటూరు అయిన విద్యానగర్‌లో ఉన్నాయి. కొన్ని దశాబ్దాల క్రితమే ఎంతో దూరదృష్టితో స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఇక్కడ ఈ విద్యాసంస్థలను నెలకొల్పారు. కోట, వాకాడు ప్రాంతాలకు ఈ విద్యాంస్థలు ఓ ల్యాండ్ మార్క్ లాంటివి. ముఖ్యంగా హరిజనులకు విద్యను అందించాలనే లక్ష్యంతో స్థాపించిన ఈ విద్యాసంస్థ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఈరోజు దాదాపు డీమ్డ్ యూనివర్శిటీ స్థాయికి తగ్గట్లుగా ఎదిగాయి. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జీవన, రాజకీయ ప్రస్థానం మొదలైంది కూడా ఇక్కడే! నెల్లూరుజిల్లాలో మొట్టమొదటి ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌బికెఆరే!*

ఎంతో చారిత్రక ప్రాధాన్యతగల ఈ విద్యాసంస్థలు తరచూ వివాదాలతో పత్రికలకెక్కుతున్నాయి. దీనికి కారణం నేదురుమల్లి కుటుంబాల మధ్య రేగుతున్న గొడవలే! కాలేజీపై ఆధిపత్యం కోసం అటు నేదురుమల్లి పద్మనాభరెడ్డి కుటుంబం, ఇటు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుటుంబం పంతానికి పోతుండడం ఈ విద్యాసంస్థల పాలిట గ్రహణంగా మారుతోంది. 2009ఎన్నికల వరకు నేదురుమల్లి కుటుంబం ఒక్కటిగా వుంటూ ఈ కాలేజీలో ఎలాంటి గొడవలు లేకుండా వున్నాయి. ఈ విద్యాసంస్థలకు నేదురుమల్లి పద్మనాభరెడ్డి కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. 2009 ఎన్నికల దాకా అన్నదమ్ములు పద్మనాభరెడ్డి, జనార్ధన్‌రెడ్డి కలిసిమెలసి వుండేవాళ్లు. కాని ఆ ఎన్నికల్లో తనను కాదని గూడూరు కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్ తెచ్చుకున్న పనబాక కృష్ణయ్యను ఓడించాలని జనార్ధన్‌రెడ్డి పంతం పట్టాడు. కాని పద్మనాభరెడ్డి మాత్రం కాంగ్రెస్‌పార్టీ మీద గౌరవంతో పనబాక కృష్ణయ్యకు మద్దతుగా పనిచేశాడు. నేదురుమల్లి సోదరులకు ఇక్కడే వైరం ఏర్పడింది. ఆ తర్వాత జనార్ధన్‌రెడ్డి ప్రోద్బలంతో నేదురుమల్లి పద్మనాభరెడ్డిని ఎన్‌బికెఆర్ విద్యా సంస్థల నుండి అవమానకరంగా బయటకు పంపేసి ఆ స్థానాన్ని నేదురుమల్లి రాంకుమార్ ఆక్రమించారు. దాదాపు నాలుగేళ్లుగా రాంకుమార్‌రెడ్డి ఆధిపత్యంలోనే ఈ విద్యాసంస్థలు నడిచాయి.

తాజాగా ఇటీవల నేదురుమల్లి పద్మనాభరెడ్డి మళ్లీ కళాశాలలోకి వెళ్లారు. కరస్పాండెంట్ సీటులో కూర్చున్నారు. విద్యాసంస్థలపై నాకే హక్కుందన్నారు. మరోపక్క రాంకుమార్‌రెడ్డి కాలేజీలోకి వెళ్లారు. విద్యాసంస్థల సిబ్బంది కూడా రెండువర్గాలుగా విడిపోయాయి. ఎవరి బలం వాళ్లు చూపించుకున్నారు. వాతావరణం ఘర్షణల దాకా పోయింది. రెవెన్యూ, పోలీసు అధికారుల జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. ఇటీవల ఒకరోజు రాంకుమార్‌రెడ్డి తన పెదనాన్న పద్మనాభరెడ్డిని కారులో ఎక్కించుకుని ఇంటికి తీసుకెళ్లారు. ఇంట్లో ఏం మాట్లాడుకున్నారో ఏమో రాజీపడ్డారు. రాంకుమార్‌రెడ్డి వచ్చి యధాఫలంగా ఛైర్మెన్ సీటులో కూర్చున్నారు. ఇక్కడితో వాతావరణం చల్లబడింది.

# చీకటి వీరుడు... నిస్సహాయ శూరుడు

## - మంత్రిపై అనిల్ జోకులు



రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ ఆ శాఖకు మంత్రిగా కాకుండా ఒక జోకర్‌లా వ్యవహరిస్తున్నారంటూ నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ నెల 21వ తేదీన నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎప్పట్లాగానే నారాయణను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. ఈయన చీకటి వీరుడు, అర్ధరాత్రిళ్లు నెల్లూరులో సమావేశాలు పెడతాడు, తెల్లారేసరికి తుళ్లూరుకు తుర్రుమనిపోతాడు. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఈయనకు ముఖ్యమైపోయింది. ఆయన నెల్లూరు వచ్చేది ఎంపీకి తెలియదు, ఎమ్మెల్యేలకు తెలవదు, చివరికి సొంత పార్టీ వాళ్లకు కూడా తెలియదు. ప్రజాసమస్యలపై ఇతనికి అవగాహనే లేదు. ఇలాంటి మంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఒక్క పనీ చేయడం చేతకాని మంత్రి నారాయణ ఈ జిల్లావాడైనందుకు సిగ్గుపడాల్సి వస్తుందన్నారు. నిజాయితీగా పనిచేసే అధికారులను బదిలీ చేయడం మాత్రమే మంత్రికి తెలుసన్నారు. ప్రజా సమస్యల గురించి మేం మాట్లాడితే ఆయన ప్రతిపక్షాలపై నోరు పారేసుకుంటున్నారని, మంత్రి నారాయణ అభివృద్ధి అజెండాతో వస్తే పూలుచల్లి తామే స్వాగతిస్తామని అనిల్ పేర్కొన్నారు.

# హడ్కో నిధులొచ్చాయోచ్...

## • తిరిగి కట్టడానికి పన్నులు బాదాల్సిందే

ఏ ఆదాయమూ లేక ఎలాంటి పనులు చేయలేక నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న నెల్లూరు నగరపాలకసంస్థకు 1090కోట్లు హడ్కో నిధులు మంజూరైనట్లుగా తెలుస్తోంది. ఈ నిధులు మంజూరైనట్లు తెలియగానే ప్రపంచ యుద్ధంలో గెలిచినట్లుగా మేయర్ అబ్దుల్ అజీజ్ స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నాడు. నెల్లూరుకు హడ్కో నిధుల ప్రతిపాదన ఎప్పటి నుండో వుంది. కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు ఈ నిధులు విడుదల చేయించడానికి కృషి చేసాడు. ఈ నిధులలో 525కోట్లు భూగర్భ డ్రైనేజీకి 475కోట్లు తాగునీటి అవసరాలకు ఖర్చు పెడతామని మున్సిపల్ మంత్రి నారాయణ చెప్పారు. హడ్కో నిధులొస్తాయి. ఈ పనులకు ఖర్చు పెడతారు. అయితే ఈ నిధులు ఫ్రీగా ఇచ్చేవికావు. ప్రతి సంవత్సరం నెల్లూరు నగరపాలక సంస్థ తిరిగి వంద కోట్ల దాకా కట్టాల్సి వుంటుంది. ప్రతి ఏటా ఈ వందకోట్ల భారాన్ని పన్నుల రూపంలో ప్రజలపై మోపుతారనే భయం కూడా ఇప్పుడు తలెత్తుతోంది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# కొత్తూరులో నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు



- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- కళకళలాడిన శ్రీ షిర్డి సాయిబాబా, శ్రీ యోగాంజనేయస్వామివార్ల ఆలయాలు

ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసివున్న శ్రీ షిర్డి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో కొత్తూరు గ్రామం కిటకిటలాడింది. ఈ నెల 11 నుంచి 15వ తేదీ దాకా జరిగిన ఈ ఉత్సవాల సందర్భంగా, గ్రామంలో ఎటుచూసినా భక్తజనసందోహమే కనిపించింది. కొత్తూరునుంచే కాక, చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఉత్సవాలకు తరలివచ్చారు. అయిదురోజుల పాటు నయనానందకరంగా జరిగిన ఈ వేడుకలను వేలాదిమంది భక్తులు కనులారా తిలకించి పులకించిపోయారు. కొత్తూరులో కలికి కోదండరామిరెడ్డి దాతృత్వంతో అత్యద్భుతంగా నిర్మితమైన ఈ ఆలయాలు భక్తాదులను భక్తిపారవశ్యులను చేశాయి. శ్రీ షిర్డి సాయిబాబా ఆలయాన్ని, ఆ చెంతనే వున్న శ్రీ యోగాంజనేయస్వామివారి ఆలయాన్నీ భక్తులు ఈ సందర్భంగా సందర్శించుకుని ఆ అపురూపమైన ఆలయాలను చూసి ఆనందతరంగిత హృదయులయ్యారు. అయిదురోజుల పాటు అంగరంగవైభవంగా ఈ ఉత్సవాలు జరిగాయి. కొత్తూరులోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరం ట్రస్ట్ నిర్వాహకులైన ప్రముఖ వదాన్యులు, ఆలయ ధర్మకర్తలైన శ్రీమతి కలికి శ్రీలత-శ్రీ కలికి కోదండరామిరెడ్డిల నేతృత్వంలో అద్యంతం భక్తిభావస్పోరకంగా జరిగిన ఈ ఉత్సవాలు వేడుకలకే వేడుక అన్నట్లుగా కన్నులపండువగా జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా, శ్రీ సాయిబాబా మంది రంలో 11వ తేది ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దేవతా ప్రార్ధనతో ప్రారంభమై, అనం తరం గణపతిపూజ, పుణ్యాహవచనం, దేవనాంది, దీక్షా కంకణధారణం, మహాసంకల్పం, కృచ్ఛాచరణ, ఋత్విక్ వరణ, అష్ట మూర్తి ప్రార్ధన, బ్రహ్మకూర్చ హోమం, అధర్వశీర్ష గణపతి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆ తర్వాత సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు అదే విధంగా విశేష పూజలను నిర్వహించారు. 12వ తేది ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శాస్త్రోక్తంగా స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ షిర్డి సాయిబాబా వారి మహాపూజ, పల్లకీసేవ, అష్టావధాన సేవ, మహా మంగళహారతి కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

***శ్రీ యోగాంజనేయస్వామి మందిరంలో విశేష పూజలు :***

అదేవిధంగా, ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ షిర్డి సాయిబాబా ఆలయాన్ని, ఆ చెంతనే వున్న శ్రీ యోగాంజనేయస్వామివారి ఆలయాన్నీ భక్తులు ఈ సందర్భంగా సందర్శించుకుని ఎంతో అద్భుతంగా, నయన మనోహరంగా వున్న ఆ ఆలయాలను చూసి ఆనందతరంగిత హృదయులయ్యారు. శ్రీ యోగాంజనేయస్వామి మందిరంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా, 13వ తేదీ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల దాకా కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో శ్రీలత-కోదండరామిరెడ్డి దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా, 14వ తేదీ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల దాకా పూజలు నిర్వహించి, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10 గంటల దాకా స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆ తర్వాత శ్రీరామ, ఆంజనేయస్వామి పరివార దేవతామూర్తుల ప్రాకారోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.





అనంతరం, మరింత వైభవంగా స్వామివారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. 15వ తేదీ ఉదయం 8 గంటల నుంచి స్వామివారికి పూజలు హోమాలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఈ అయిదు రోజులూ ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం విశేషం.

పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో కుటుంబ సమేతంగా పాల్గొని, బ్రహ్మోత్సవ వేడుకలను ఆసాంతం తిలకించి, స్వామివార్లను దర్శించుకుని తరించిపోయారు.



పనబాక కృష్ణయ్యను సన్మానిస్తున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదితర నాయకులు


# ఘటికుడు పనబాక కృష్ణయ్య

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మరట్వాడ విశ్వవిద్యాలయం నుంచి పనబాక కృష్ణయ్య డాక్టరేట్ అందుకున్న సందర్భంగా గూడూరులో ఆయనకు సన్మానసభను 18వ తేదీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత కలెక్టర్ గోపాలరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పనబాక కృష్ణయ్య ఉన్నతాశయాలు గల వ్యక్తి అని అన్నారు. ఉద్యోగం, సేవా కార్యక్రమాల్లో ఎన్నో విజయాలు సాధించారన్నారు. సేవ చేయడం వేరు, నెగ్గడం వేరని, చివరకు గుర్తుండిపోయేది సేవేనన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ గూడూరులో పనబాక కృష్ణయ్య ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, చెరువు వద్ద వాకర్స్ నడిచేలా కాలి నడకబాటకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. సన్మాన గ్రహీత పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ ఇంతకాలం పిహెచ్‌డి చేస్తున్నందుకే గూడూరుకు రాలేకపోయాన్నారు. ఆర్థికశాస్త్రంలో పొదుపు సంఘాల అభివృద్ధిపై అధ్యయనం చేశానన్నారు. పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని గూడూరును మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పట్టణంలో అనేక చోట్ల సిసిరోడ్లు, పలు పనులు మంజూరైనా పెండింగ్‌లో వున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం, అధికారులతో మాట్లాడి వాటిని వెంటనే పూర్తి చేయిస్తానన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా గజమాలలతో సన్మానించారు. ఆహ్వానకమిటి సభ్యులు దశరథరామిరెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, కె.మునిగిరీష్, అరవ పార్వతయ్య, దేవకుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పొనకా శివకుమార్‌రెడ్డి, మనుబోలు హరిప్రసాద్‌రెడ్డి, వివిధ సంస్థలు, పార్టీల నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ గూడూరు వార్తలు

### నాటకరంగ మనుగడకు

# సిద్ధారెడ్డి జనార్ధనరెడ్డి 20లక్షల భూరి విరాళం



సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్, పనబాక కృష్ణయ్య, గోపాల్‌రెడ్డి

గూడూరులోని డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో నాలుగురోజుల నుంచి సాంస్కృతిక సమ్మేళనం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి సాంఘీక నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. సాంస్కృతిక సమ్మేళనానికి రూ. 20లక్షలు విరాళం ప్రకటించిన సంస్కృతి సమ్మేళనం అధ్యక్షులు సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ నాటకాల్లో నటించడం ఎంతో కష్టమని, కానీ నటనా రంగంలోంచి వచ్చినవారే రాష్ట్రాలను శాసించారన్నారు. డాక్టర్ పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ కనుమరుగవుతున్న నాటకాలను జనాల్లోకి సంస్కృతి సమ్మేళనం తీసుకెళుతోందన్నారు.

అనంతరం నాటక ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ వారి 'రెండు నిశ్శబ్దాల మధ్య', నంద్యాల కళారాధన వారి 'సైకత శిల్పం', గోవా షుగర్స్ వారి లలితసాయి శ్రీక్రియేషన్స్ వారి 'ఖాళీలను పూరించండి' నాటికలు విజయం సాధించాయి. ఇంకా నాటికలోని పలు విభాగాల్లో నటీనటులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సంస్థ ప్రధానకార్యదర్శి కొణిదల మునిగిరీష్, కోశాధికారి జి.జి.నాయుడు, నాటక విభాగ వ్యవహారకర్త జానా శివయ్య, సభ్యులు న్యాయవాది వై.చలపతిరావు, సోమిశెట్టి చెంచురామయ్య, శేగు ప్రసాద్, న్యాయనిర్ణేతలు బాల రామ్మూర్తి, బాలకోటయ్య, వేణు, నటీనటులు, ప్రేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

### జివిఎస్ స్కూల్‌లో

# రిటైర్డ్ జడ్జి చలపతిరావు దంపతులకు సన్మానం



రిటైర్డ్ జడ్జి చలపతిరావు దంపతులకు సన్మానం చేస్తున్న పవన్‌కుమార్, సుమన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా జడ్జి కనకారావు, రిటైర్డ్ జడ్జి చలపతిరావు, జడ్జి గురప్ప, డిఇఓ ఆంజనేయులు, పవన్‌కుమార్, భాస్కర్‌రావు

గూడూరు పట్టణంలోని జీవిఎస్ శంకరయ్య మెమోరియల్ ఇంగ్లీషు మీడియం స్కూలులో రంగారెడ్డి జిల్లా రిటైర్డ్ జడ్జి మందడి చలపతిరావు దంపతులకు జీవిఎస్ స్కూల్ కరస్పాండెంట్ జి.వి.పవన్‌కుమార్, సుమన దంపతులచే ఘనంగా సన్మానం జరిగింది. ఈయన గూడూరులో గతంలో జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా పనిచేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరుజిల్లా జడ్జి కనకారావు హాజరై మాట్లాడుతూ సమాజంలోని వివిధ అంశాలపై పిల్లల ప్రభావం మరియు సమాజ స్పృహ గురించి వివరించడం జరిగింది. సన్మానగ్రహీత రిటైర్డ్ జడ్జి చలపతిరావు మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం చాలా చిన్నస్థాయి నుండి ఎదిగి పట్టణంలోని విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన మంచి విద్యను అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు రుజువర్ధనతో మెలగాలని అన్నారు.

ఈ కార్యక్రమానికి యరగుడిపాటి భాస్కర్‌రావు అధ్యక్షత వహించగా జిల్లా విద్యాశాఖాధికారి ఆంజనేయులు, గూడూరు అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి గురప్ప, న్యాయాధికారులు, న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



అగ్నిమాప వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 20వ తేదీ సిఆర్ రెడ్డి హాస్పిటల్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి భాస్కర్‌రావు, ప్రక్కన డాక్టర్ జనార్ధన్‌రెడ్డి

# 3 నెలల్లో సోమశిల - స్వర్ణముఖి కాలువ పూర్తి

**- ఇరిగేషన్ మంత్రి దేవినేని**

సోమశిల - స్వర్ణముఖి కాలువ పనులు మూడు నెలల్లోపు పూర్తి చేసి ప్రజలకు త్రాగునీరు, సాగునీరు అందిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. ఈ నెల 18వ తేదీ ఎంజిఎం గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

సమావేశానికి మాజీ మంత్రి పరసా రత్నం స్వాగతం పలుకగా మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఇరిగేషన్ శాఖ మంత్రి మాట్లాడుతూ అటవీశాఖ అనుమతులు లభించడంతో మూడు నెలలోపు పనులు పూర్తిచేసి ఏడాది లోపు కాలువలో నీళ్లు వచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. దీనిపై చిత్తూరు జిల్లా నీటిపారుదల శాఖాధికారులతో సమీక్షించారు. కాలువ ద్వారా ఎన్ని టిఎంసి నీళ్లు వస్తాయని కాలువ వెడల్పు, లోతు వంటి విషయాలపై చర్చించగా వారి నుండి సరైన సమాధానం రాకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు ఇరిగేషన్ శాఖ మంత్రిగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పురాతన కాలం నాటి రాజులు త్రవ్వించిన చెరువుల్ని ఆధునీకరించుకొని తన నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రసంలందుకున్న రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నేడు తెలుగుగంగ ప్రాజెక్టుకు 30 సంవత్సరాలుగా శాపంగా ఉన్న "అటవీశాఖ క్లియరెన్స్" సాధించారన్నారు. నేడు రాష్ట్రంలో పారదర్శకతతో పని చేసే ప్రభుత్వముందన్నారు. ఒకనాడు రాయలసీమకు తెలుగు గంగను తీసుకురావాలనుకున్న ఎన్టీఆర్ ప్రయత్నాలను అడ్డుకుంటామని స్వర్గీయ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంటే నేడు రాయలసీమకు గోదావరి జలాలు పట్టిసీమ ద్వారా తీసుకు వస్తామంటే ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. హంద్రీనీవాకు 40టిఎంసిల నీరు - గండికోటకు 20టి.ఎంసిల నీరు ఇస్తామన్నారు.





## శ్రీకాళహస్తి న్యూస్

రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం జరిపి వేల కోట్లు దిగమింగి నేడు కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు ప్రతిపక్ష నాయకుడు కావటం దురదృష్టకరమన్నారు. హంద్రీ నీవాకు వంద కోట్లు అయినా నిధులు ఇస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ప్రకటించడం చాలా హర్షణీయమన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ సుధాకర్, శాప్ చైర్మన్ పిఆర్ మోహన్, సత్యవేడు ఎమ్మెల్యే తలారి ఆదిత్య, తెలుగుగంగ అధికారులు పాల్గొన్నారు.

# శివుని సేవలో ఇరిగేషన్ మంత్రి

దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఈ నెల 18వ తేదీ అమావాస్య సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డిలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో, మేళతాళాలతో వేదపండితుల మంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం దక్షిణామూర్తి వద్ద వేదపండితులు ప్రత్యేకాశీర్వాదాలు చేశారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

తలపెట్టిన పనులు సమర్ధవంతంగా పూర్తి చేస్తారు. వృత్తివ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయవృద్ధి ఉంటుంది. వ్యవహారాలలో తొందరపాటు ప్రదర్శించ వద్దు. రావలసిన బాకీలు కొంత మేరకు లభిస్తాయి. బంధువులతో సంబంధాలు బలపడతాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో ఆటంకాలు తొలగిపోతాయి. విలువైన వస్తు వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభకార్య ఖర్చులు, వైద్య ఖర్చులు పెరుగుతాయి. వాహనాలు నడిపేవారు, యంత్రాలతో పనులు చేసే వారు జాగ్రత్తగా ఉండాలి. అనుకున్నది సాధించేవరకు శ్రమిస్తారు. కుటుంబంలో కొద్ది అవగాహనాలోపాలుంటాయి. ఆదాయము తప్తికరము. పనులు నిదానంగా జరుగుతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. వ్యవహారాలలో, ఒప్పందాలలో హామీలివ్వవద్దు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ప్రభుత్వ పరంగా మీకు జరగవలసిన పనులు ఆలస్యం కాగలవు. రావలసిన బాకీలు నిలబడిపోవడం, అవసరాలకు ఋణం చేయడం జరుగవచ్చును. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగగలవు. ముఖ్య విషయాలలో నిర్ణయాలు చేయలేక ఇతరుల సలహాలు కోరతారు. షేర్ల పెట్టుబడులపై లాభాలుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

పెద్దమొత్తాలలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలలో పెట్టుబడులకు తొందరపడవద్దు. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. వృత్తివ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. వాహనాలు, యంత్రాల వల్ల గాయాలు తగలవచ్చును. భూములు, స్థలాల క్రయవిక్రయాలలో ఆలోచనకు పదునుపెట్టండి. సొంత పనులందు ఆటంకాలను అధిగమిస్తారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 24.04.2015 నుండి**
**తేది. 30.04.2015 వరకు**

ఈ వారం మేషంలో రవి కుజులు, వృషభంలో బుధ శుక్రులు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువులు, వృశ్చికంలో శని, మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

ముహూర్తములు లేవు

### వైశాఖమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 24 | శుక్ర | షష్ఠి | రా॥ గం.6.34వ॥ |
| తేది. 25 | శని | సప్తమి | రా॥గం.7.28వ॥ |
| తేది. 26 | ఆది | అష్టమి | రా॥గం.8.15వ॥ |
| తేది. 27 | సోమ | నవమి | రా॥గం.9.45వ॥ |
| తేది. 28 | మంగళ | దశమి | రా॥గం.11.36వ॥ |
| తేది. 29 | బుధ | ఏకాదశి | రా॥గం.1.38వ॥ |
| తేది. 30 | గురు | ద్వాదశి | రా॥గం.3.42వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. రావలసిన బాకీలు ఆలస్యం కావడం వల్ల ఋణాలు చేయవలసి వస్తుంది. సొంత పనుల కొరకు ఎంత కష్టపడినా ప్రయోజనం ఉండదు. బంధువులతో విభేదాలు, కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఆస్తి వ్యవహారాలు రాజీకి వస్తాయి. ప్రముఖులతో పరిచయాలుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త పనులకు శ్రీకారం చుడతారు. రాజకీయవర్గాలకు వృత్తుల వారికి జన సంబంధాలు బలపడగలవు. కొత్త పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు. మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. అవసరాలకు ధనం సర్దుబాటు కాగలదు. నమ్మి విలువైన వస్తువులు డబ్బు వేరొకరికి ఇవ్వవద్దు. మీ జాగ్రత్తలు మీరు పడండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వేడుకలు శుభకార్యాలు, దైవకార్యాలను ఆడంబరంగా జరుపుతారు. ఖర్చులు పెరిగినను, ఇబ్బందులుండవు. కొత్త వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి వుండి, ఆదాయం పెరుగుతుంది. ఇంట బయట మీ మాటకు విలువ ఉంటుంది. గృహావసరాలను సమకూర్చుకొంటారు. స్థలాల క్రయవిక్రయాలు జరుగుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయ వ్యయాలు ఫరవాలేదనిపించగలవు. వాణిజ్య వర్గాలకు అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. శుభ కార్యాల నిర్ణయంలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. ప్రభుత్వ అనుమతులు లభించడం, బ్యాంకు ఋణాలు దొరకడం జరుగుతుంది. అనుకున్న పనులను సమర్థవంతంగా జరుపుతారు. హామీలు, మధ్యవర్తిత్వాల వల్ల ఇబ్బందులు రాగలవు. ఆరోగ్యం బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ముఖ్యమైన వ్యవహారాలలో ప్రధానభూమిక పోషిస్తారు. నిర్దుష్టమైన ఆలోచనలు, ప్రణాళికలతో వ్యవహారాలలో ఇంట బయట ముందుకు సాగుతారు. సోదర బంధు వర్గంతో స్వల్పంగా విభేదాలు రావచ్చును. విలువైన వస్తువులు నగదు జాగ్రత్తగా కాపాడుకొనండి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు అవకాశాలు కలిసివస్తాయి. బిడ్డలతో కొద్దిపాటి అభిప్రాయ భేదాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యవహారాలు సొంత పనులకు ఆటంకాలు ఎదురైన మరల తొలగిపోతాయి. వృత్తి ఉపాధి పథకాలలో స్థిర పడతారు. ఆదాయం స్వల్పంగా పెరిగినా అనుకోని ఖర్చులు పైనబడగలవు. కుటుంబ వ్యవహారాలు చక్క బడతాయి. ఇతరుల సలహాలను గ్రుడ్డిగా పాటించక ఆలోచనలు చేయండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కోపం పట్టుదలల కారణంగా పనులు చెడిపోకుండా జగ్రత్తపడండి. ఈ కారణంగా ఇతరులతో మనస్పర్థలు రావచ్చును. వృత్తిపరంగా అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. గృహ వస్తువాహన రిపేర్ల ఖర్చులుంటాయి. అనుకున్న పనులు ఓపికగా జరుపుకొనండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతున్ననూ ఎక్కువగా టెన్షన్ పడుతుంటారు. కోపం, చికాకు తగ్గించుకొని ఇతరులతో వ్యవహరించండి లేకుంటే తగాదాలు వచ్చే పరిస్థితి ఉన్నది. మీ సూచనలు సలహాల వల్ల ఇతరులకు మేలు కలుగుతుంది. కొత్తగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తే అనుకూలత ఉంది.

# వృద్ధులకు వస్త్రదానం




లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ కృష్ణకుమార్ తన కుమారుడు సిద్ధార్థకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ నెల 21న నెల్లూరు, బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్రదానం, అల్పాహారం విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ తదితరులు పాల్గొన్నారు.

### రోలర్ స్కేటింగ్ చిన్నారికి

# కలక్టర్ సన్మానం

జాతియస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా పోటీలు ఇటీవల పూణేలో జరిగాయి. రోలర్ స్కేటింగ్‌లో నెల్లూరుకు చెందిన డి.సంజన బంగారు పతకం సాధించింది. ఈ క్రీడకారిణిని శనివారం జిల్లా కలెక్టర్ ఎం.జనకి తన చాంబర్‌లో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని నెల్లూరు జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జడ్.శివప్రసాద్,కార్యదర్శి జి.ఈశ్వర్ కోచ్ భరతి,చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# త్వరలో 'ఇంటర్ సెప్టార్' వాహనం




అత్యంత అధునాతనమైన ఇంటర్ సెప్టార్ పోలీస్ వాహనంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు జిల్లా పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వున్న ఇంటర్‌సెప్టార్ వాహనాన్ని కూడా ప్రభుత్వం జిల్లా పోలీసుశాఖకు కేటాయించింది. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఈ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుంది. వాహన వేగాన్ని నియంత్రించేందుకు అవసరమైన పిటిజెడ్ సీసీ కెమెరా, స్పీడ్ లేజర్‌గన్‌లను అమర్చి, వాటిని మానిటర్‌కు అనుసంధానం చేస్తున్నారు. అధికవేగంతో వెళ్ళే వాహనాలను ఈ కెమెరా ద్వారా చిత్రీకరించవచ్చు.

అంతేకాదు, ఏ వాహనం ఏ ప్రాంతంలో ఎంత వేగంతో వెళ్తోందో మానిటర్ ద్వారా గమనించవచ్చు. ఆ వాహనదారుకు తగిన అపరాధ రుసుం విధించేందుకు ఇది ఉపయోగపడుతుంది. అంతేకాదు, ఎక్కడైనా ఘర్షణలు, అల్లర్లు, సభలు సమావేశాలు జరిగేటప్పుడు ఆయా ప్రాంతాల వద్ద ఈ వాహనం వుంచితే ఆ పరిసర ప్రాంతాల్లోని దృశ్యాలన్నిటినీ పిటిజెడ్ కెమెరా చిత్రీకరిస్తుంది. దీనివల్ల ఆయా ఘటనలకు బాధ్యులైనవారు ఎవరో గుర్తించడానికి ఎంతో వీలుగా వుంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంటర్‌సెప్టార్ వాహనాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో, త్వరలో జిల్లాలోనూ ఈ వాహనసేవలు అందుబాటులోకి రానున్నాయని తెలుస్తోంది.

# సాహసానికి మరో పేరు.. మస్తాన్‌బాబు

**- కోరుకొండ సైనిక పాఠశాల రిజిస్ట్రార్**

ప్రఖ్యాత పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు సాహసానికి మరో పేరని, ప్రపంచంలోని పలు ఎత్తయిన పర్వతశిఖరాలను అధిరోహించి ఎంతో ప్రఖ్యాతిగాంచాడని కోరుకొండ సైనిక పాఠశాల రిజిస్ట్రార్ అశోక్‌బాబు అన్నారు. సంగం మండలంలోని గాంధీజనసంఘానికి ఆయన సోమవారం విచ్చేసి, మస్తాన్‌బాబు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థినని, మల్లి మస్తాన్‌బాబును తాను చిన్నతనం నుంచి గమనించేవాడినని, మస్తాన్‌బాబు బాల్యం నుంచి మంచి సాహసికుడని ఆయన కొనియాడారు. మస్తాన్‌బాబు మంచి వ్యక్తిత్వం అందరికీ ఆదర్శమన్నారు. పేద కుటుంబానికి చెందిన మస్తాన్‌బాబు ఎంతో పట్టుదలతో ఐఐటి, ఎన్ఐటి చదవడం విశేషమని, అంతేకాక పర్వతారోహణపై ఆసక్తితో ఎంతో శ్రమకోర్చి ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాలను అధిరోహించి గిన్నిస్‌బుక్ రికార్డుల్లో స్థానం సాధించడం దేశానికే ఎంతో గర్వకారణమైన విషయమన్నారు. మస్తాన్‌బాబు తలచుకుంటే కోట్లను గడించే అవకాశాలు ఇచ్చే ఎన్నో కంపెనీలు వున్నా, దేశమాతకు కీర్తిని సముపార్జించడమే అన్నిటికంటే ఎంతో గొప్పదని భావించిన మహోన్నతమైన వ్యక్తిత్వం మస్తాన్‌బాబుదని ఆయన ప్రశంసించారు. అలాంటి బిడ్డను కన్న తల్లి సుబ్బమ్మ జీవితం ధన్యమన్నారు. కోరుకొండ స్కూల్‌లో మస్తాన్‌బాబు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కూడా ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

# కాలువ పనులు వేగవంతం

నెల్లూరు నగరంలోని 8వ డివిజన్ రామచంద్రాపురం దళితపాళెం, సీఆర్పీ డొంక ప్రాంతాల్లోని కాలువల్లో జరుగుతున్న పూడిక తీత కార్యక్రమలను ఈ నెల 14న తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జడ్.శివప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పూర్తి స్థాయిలో కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరాల సుబ్రమ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పినాకిని యూత్ నివాళులు




పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి, పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బుజబుజ నెల్లూరులోని శ్రీనివాస ఇంగ్లీషు మీడియం హైస్కూలులో అంతర్జాతీయ పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబుకు సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కె.మురళీమోహన్‌రాజు, రాచపాళెం రఘువంశీకుమార్, శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వెంట్లకు ప్రధాని లైవ్ ప్రసంగం

సివిల్ సర్వీస్ డే దినోత్సవం జిల్లా కలెక్టరు ఛాంబర్లో మంగళవారం జరిగింది. ముస్సోరి ఐ.ఎ.ఎస్.శిక్షణ అకాడమి నుండి భారత ప్రధాని నరేంద్ర మోడి సివిల్ సర్వీస్ సర్వెంట్ల ఆవశ్యకత గురించి దూరదర్శన్ లైవ్‌లో ప్రసంగించారు. ఈ ప్రసంగాన్ని జిల్లా కలెక్టరు మరియు జాయింట్ కలెక్టరు ఇతర ఉన్నతాధికారులు, రిటైర్డ్ అధికారులు తిలకించారు. టి.వి.ప్రసంగంలో ప్రధాని నరేంద్రమోడి సివిల్ సర్వీస్ అధికారులలో ఎఫిషియన్సి, ఎకానిమి, సోషల్ రెస్పాన్స్ బిలిటి గురించి మాట్లాడారు. అదే విధంగా ఆయన జాతీయ సమగ్రత వివిధ అంశముల గురించి సివిల్ సర్వెంట్ల బాధ్యత గురించి టి.వి.లో ప్రసంగించారు.



ముందుగా జాయింట్ కలెక్టరు ఎ.ఎం.డి.ఇంతియాజ్ మాట్లాడుతూ నేడు సివిల్ సర్వెంట్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. యిటీవల కర్నాటక రాష్ట్రంలో ఒక యువ ఐ.ఎ.ఎస్.అధికారి మరణం గురించి ప్రస్తావించారు.

జిల్లా కలెక్టరు శ్రీమతి ఎం.జానకి మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ల బాధ్యత గురించి తెలియజేశారు.

ఈ సమావేశంలో రిటైర్డ్ ఐ.పి.ఎస్. అధికారి,కృష్ణపట్నం సి.ఇ.ఓ.వై.అనీల్ కుమార్, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్.అధికారులు సత్యనారాయణ మరియు బాలసుబ్రమణ్యం, కష్టమ్స్ మరియు ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్,అదనపు జాయింట్ కలెక్టరు సాల్మన్ రాజ్‌కుమార్, డి.ఆర్.ఓ.యం.సుదర్శన్ కలెక్టరు కార్యాలయపు ఎ.ఓ.రామకృష్ణ,వివిధ విభాగాల పర్యవేక్షక అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల రక్షణలో చెన్నై బస్సులు

నెల్లూరు నుంచి చెన్నైకి పోలీసుల బందోబస్తు మధ్య ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. రాష్ట్ర సరిహద్దు పన్నంగాడు వద్ద సోమవారం రాత్రి ఏపీఎస్ఆర్టీసీ బస్సులపై ఎర్రచందనం దొంగల అనుచరులు రాళ్ళు రువ్వారు. ఆయా డిపోల అధికారులు సర్వీసులను ఆపకుండా మంగళవారం చెన్నైకి పోలీసుల రక్షణ మధ్య వాహనాలు నడిపారు. శేషాచలం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో తమిళనాడుకు చెందిన 20 మంది ఎర్రచందనం కూలీలు చనిపోయారు. ఈ సంఘటనకు నిరసనగా అక్కడివారు ఆందోళనలు చేపట్టారు. దీంతో కొద్ది రోజులు ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఇటీవల ప్రారంభం కాగా సోమవారం రాత్రి మళ్లీ దుండగులు రాళ్ళు విసరడంతో నాలుగు బస్సుల అద్దాలు పగిలాయి. ఈ క్రమంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమై పన్నంగాడు వద్ద శ్రీకాళహస్తి డిపో బస్సుపై దాడి జరిగిన అనంతరం జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనల గస్తీని పెంచారు. దాడులను అడ్డుకునేందుకు జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ తడకు ప్రత్యేక పోలీసు బలగాలను మంగళవారం పంపారు.బస్సులకు రక్షణగా సరిహద్దు పన్నంగాడు తడ మధ్య మొబైల్ పార్టీని ఏర్పాటు చేసారు.

### నిప్పో ఫ్యాక్టరీ ఆవరణలో...

## సాయిబాబా గుడికి శంకుస్థాపన



నెల్లూరు నిప్పో సెంటర్‌లోని జివిఎస్‌టి రోడ్డును ఆనుకుని వున్న సాయిబాబా మందిరం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ గుడి వల్ల ఇక్కడ రోడ్డు విస్తరణ కూడా నిలిచిపోయింది. అయితే, సెంటిమెంటు కారణంగా అధికారులు ఈ గుడిని తొలగించలేకపోయారు. ఇటు అధికారుల సమస్యను, అటు భక్తుల సెంటిమెంట్‌ను గౌరవిస్తూ నిప్పో యాజమాన్యం తమ ఫ్యాక్టరీ ఆవరణలోనే ఈ గుడి నిర్మాణానికి స్థలం ఇచ్చి, కట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ నెల 23వ తేదీన ఆలయ నిర్మాణానికి నిప్పో ఫ్యాక్టరీ వ్యవస్థాపకులు స్వర్గీయ పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి కుమారుడు, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నిప్పో ఫ్యాక్టరీ ప్రెసిడెంట్ ఎం.శంకర్‌రెడ్డి, డిజిఎం పి.వి.మోహన్‌రామిరెడ్డి, ప్రముఖ న్యాయవాది నాగారెడ్డి శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రయివేట్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు ఛైర్మెన్ అయితే లోకేష్ మేనేజింగ్ డైరెక్టర్‌లా, కేంద్రమంత్రి సుజనా చౌదరి డైరెక్టర్, రాష్ట్ర మున్సిపల్ మంత్రి పి.నారాయణ సిఇఓ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు, వారి సమస్యలు, ప్రజాసంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వంటివి ప్రభుత్వ పాలనలో ఎక్కడా కనిపించడం లేదు. రాష్ట్రంలో వ్యవహారాలన్నీ సుజనాచౌదరి, నారాయణలకే వదిలేసారు. వాళ్లిద్దరూ వ్యాపారులే! పరిపాలనను కూడా వ్యాపారంగా మార్చేసారు. రాజధాని ముసుగులో వ్యాపారానికి తెరతీసారు. ఇప్పటికిప్పుడు అందమైన రాజధాని అవసరం లేకున్నా మూడుకార్ల పంటలు పండే పచ్చటి పొలాలను రాజధాని పేరుతో తీసుకుంటున్నది రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే. ఏపి నూతన రాజధాని విషయంలో శివరామకృష్ణన్ కమిటి చంద్రబాబు నిర్ణయాన్ని గతంలోనే తప్పుపట్టింది. ఇప్పుడూ తప్పుపడుతుంది. భూములు, పైర్లు గురించి తెలిసిన వారెవరైనా సరే తుళ్లూరు ప్రాంతంలో సారవంతమైన భూములను రాజధాని పేరుతో నాశనం చేయడాన్ని ఆమోదించరు. కాని ఇక్కడ వ్యాపారం ప్రధాన లక్ష్యంగా మారిపోయింది. మున్సిపల్ మంత్రిగా నారాయణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మున్సిపల్ వ్యవహారాలను చూడాలి. కాని ఆయన తుళ్లూరును వదలడం లేదు. స్వయంగా ట్రాక్టర్లను నడుపుతూ ఈ భూములు చదునుచేస్తున్నాడు. రాజధాని నిర్మాణంలో అంతా కూడా ప్రైవేట్ కన్సెల్టెన్సీలు, విదేశీ కంపెనీల వ్యవహారమే. ఇదంతా వ్యాపారం కాక ఇంకేంటి?

గోదావరి మీద ఓ పక్క కేంద్రం పోలవరం ప్రాజెక్టును మంజూరు చేస్తే ఈలోపే పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టడమెందుకు? వెయ్యికోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రంలో పూర్తయ్యే ప్రాజెక్టులు చాలా వున్నాయి. వాటన్నింటిని వదిలేసి పట్టిసీమపై పట్టుబట్టడం వెనుక కారణం వ్యాపారమే.

రాష్ట్ర పరిపాలన అంతా పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి పోయింది. ప్రజాసంబంధాలు, ప్రజాసమస్యలు తెలిసిన నాయకులకు, మంత్రులకు ప్రభుత్వంలో పెద్దగా ప్రాధాన్యత లేకుండాపోయింది. మంత్రులుగా వున్న సీనియర్ నాయకులకు సైతం చేయడానికి పనులు లేవు. మంత్రులమని చెప్పుకోవడానికి తప్ప ప్రజలకు పైసా పనిచేయలేక పోతున్నామనే బాధ అందరిలో కనిపిస్తుంది.

ముఖ్యంగా ముందొచ్చిన చెవులకంటే వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు సీనియర్లు తమను కాదని కొత్తగా వచ్చిన సుజనాచౌదరి, నారాయణ వంటి వ్యాపారవేత్తలకు పూర్తిగా పాలనా వ్యవహారాలు అప్పగించడంపై పార్టీలోని సీనియర్లే గుర్రుమంటున్నారు.



ఈ నెల 16వ తేదీ గుంటూరుజిల్లా నర్సారావుపేటలో జరిగిన తెలుగు నాటకరంగ దినోత్సవంలో శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు, ఎంపి మురళీమోహన్ చేతుల మీదుగా కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకుంటున్న నెల్లూరుజిల్లా గూడూరుకు చెందిన శ్రీ కాళిదాస కళానికేతన్ వ్యవస్థాపకులు షేక్ గౌస్‌బాషా

## బాబు వచ్చి... జాబులు పీకాడు

ఏం తప్పు చేశామని ఉద్యోగాల నుంచి తొలగించేంత శిక్ష వేశారు. ఉరిశిక్ష వేసే ముందు కూడా చివరి కోర్కెలు అడుగుతారుగదా, అలాంటిదేమీ లేకుండా ముఖ్యమంత్రి చేసిన పని న్యాయం కాదని ఆయన పుట్టినరోజు కానుకగా తమకు ఇచ్చిన బహుమతి ఉద్యోగాల నుంచి తొలగించడమేనని నెల్లూరుజిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.స్వరూపరాణి విమర్శించారు. బుధవారం జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అంగన్‌వాడీ కార్యకర్తలు తరలివచ్చి నెల్లూరులోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇంతలో అక్కడకు వచ్చిన పిడి విద్యావతిని చుట్టుముట్టి సిఎం సభలో ప్లకార్డులు ప్రదర్శించినందుకు 14మంది అంగన్‌వాడీలను ఒక హెల్పర్‌ను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని నిలదీసారు.

## నెల్లూరులో నెల్లూరోళ్ళు!

(మొదటిపేజీ తరువాయి)

వంటి వారితో పాటు ఇంకా అనేకమంది నెల్లూరీయులను ఈ సదస్సుకు రప్పిస్తున్నారు. అలాగే చెన్నై నుండి సీక్రోన్ సుబ్బారెడ్డి, కెన్నెస్ నరసారెడ్డి, డా॥ సి.యం.కె.రెడ్డి, పల్లవి సుబ్బారెడ్డిలతో పాటు సినీ రంగానికి చెందిన యస్.పి.బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ కోదండరామిరెడ్డి, ముత్యాల సుబ్బయ్య వంటి వారిని కూడా పిలిచారు. ఇంకా బెంగుళూరు నుండి జె.యస్.రెడ్డితో పాటుగా అక్కడ స్థిరపడిన అనేకమంది నెల్లూరీయులను ఈ సదస్సు ద్వారా ఒక చోటకు చేర్చబోతున్నారు.

ఉదయం నుండీ మధ్యాహ్నం వరకూ జరిగే ఈ సదస్సులో నెల్లూరు నగరం మరియు జిల్లా అభివృద్ధికి అవసరమైన సలహాలు సూచనలు వీరందరి నుండి స్వీకరిస్తారు. బయట రాష్ట్రాలు, జిల్లాల వారినే కాకుండా నెల్లూరు నగరంలోని ప్రముఖులు కూడా అనేక మందిని ఈ సదస్సుకు ఆహ్వానిస్తున్నారు.

జిల్లా కలెక్టర్ ఎం.జానకితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి చెందిన ఐఎఎస్ అధికారులు, రిటైర్డ్ సివిల్‌సర్వీసెస్ అధికారులు పలువురు ఈ సదస్సులో పాల్గొనబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మున్సిపల్ మంత్రి నారాయణ సదస్సులో పాల్గొంటారు.

కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడితో పాటు సుజనాచౌదరి, డా॥ మహేష్‌శర్మలు తమ అమూల్య సలహాలు, సూచనలు అందిస్తారు. ముంబైలో జరిగిన "ముంబైనెక్ట్స్" కార్యక్రమం ఆధారంగా ఈ సదస్సును శ్రీమతి దీపావెంకట్ రూపకల్పన చేయగా, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఆహ్వానితులను మాత్రమే ఈ సదస్సుకు అనుమతిస్తారు. ఇతరులకు ప్రవేశం లేదు.

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో నెల్లూరు జిల్లాని, నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో తొలి ప్రయత్నంగా ఈ సదస్సు జరపబోతున్నారు. ఏదిఏమైనా ఒక మంచి ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా వున్న నెల్లూరోళ్ళందరినీ ఒకే వేదికపైకి అదీ నెల్లూరులోనే తీసుకురావాలనే ప్రయత్నం అభినందనీయం.

## కీలక బాధ్యతలు

(మొదటిపేజీ తరువాయి)

నందమూరి తారకరామారావు తనకు ఏడుగురు కొడుకులుంటే తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కూడా ఏ ఒక్కరినీ రాజకీయ వారసులుగా తీర్చిదిద్ద లేదు. హరికృష్ణ, బాలకృష్ణలను ప్రచారానికి, ప్రచారరథం తోలడానికి వాడుకున్నాడు తప్పితే వారిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకురాలేదు.

ఇప్పుడు చంద్రబాబు ఆ పొరపాటు చేయడం లేదు. తన రాజకీయ వారసుడిగా లోకేష్‌ను తెరకెక్కించేసారు. 2009 ఎన్నికలప్పుడే లోకేష్ రాజకీయాల్లో కాలు పెట్టాడు. 2014ఎన్నికల నుండి వేగం పెంచారు. లోకేష్‌కు చంద్రబాబు ఇప్పటికే కీలక బాధ్యతలన్నీ అప్పగించారు. తాజాగా లోకేష్‌కు మద్దతుగా తెలుగుదేశం నాయకులు గొంతు విప్పడం మొదలుపెట్టారు. చంద్రబాబు వారసుడిగా పార్టీకి లోకేష్ నాయకత్వం ఎంతైనా అవసరమని, ఆయనలో మంచి నాయకత్వ లక్షణాలున్నాయంటూ డిప్యూటీ సిఎం కె.ఇ.కృష్ణమూర్తి కీర్తించారు. ఈయన బాటలోనే ఇంకొందరు లోకేష్ నాయకత్వాన్ని సమర్ధించబోతున్నారు. ఇలా నాయకులు, కార్యకర్తలు డిమాండ్ పెరిగాక లోకేష్‌కు ఇరు రాష్ట్రాల పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించాలనేది చంద్రబాబు ఆలోచన. ఇది త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశముంది.

గల్పిక

# చంద్రబాబు ఇంట్లో చైనా వంటకాల విందు

ఉద్యమబరాట కేసీఆర్ ముఖ్యమంత్రిగా పాలిస్తున్న తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, హైటెక్‌రత్న చంద్రబాబు నివాసముంటున్న హైదరాబాద్ నగరమది. చంద్రబాబు నివాసం. చైనా నుండి ఆరోజు తెల్లారుజామునే చంద్రబాబు దిగివున్నాడు. చంద్రబాబు చైనా పర్యటన విశేషాలు తెలుసుకుందామని కేంద్రమంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనాచౌదరి, ముదురుదోమల శాఖ మంత్రి, నైట్‌రైడర్ పి.నారాయణ, మంత్రులు పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, అచ్చెన్నాయుడు, బొజ్జల, పల్లె రఘునాథరెడ్డి, ఎంపీలు సిఎం రమేష్, గల్లా జయదేవ్, టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గాలి ముద్దుకృష్ణమనాయుడు తదితరులు వెళ్లారు. వీళ్లు ఉదయం 6గంటలకు వెళ్లేసరికే ఎండ చిమచిమలాడుతుంది. సుజనాచౌదరి వుండి... నిన్న రాత్రి దాకా ఆకాశం మబ్బులు పట్టి చల్లగా వుంది, ఇంతలోనే ఈ ఎండేంటి అని అన్నాడు. వెంటనే సిఎం రమేష్... అదే మన చంద్రబాబంటే... ఆయన చైనాలో వున్నన్ని రోజులు సూర్యుడు ముఖం చాటేసాడు. ఆయన చైనా నుండి వచ్చాడని తెలుసుకుని ఇప్పుడు సంతోషంగా ప్రకాశిస్తున్నాడు. ఆ సూర్యుడుకి ఈ చంద్రుడికి వున్న అవినాభావ సంబంధమదేనని చెప్పాడు. వీళ్లంతా హాల్‌లో వున్న కుర్చీలలో కూర్చున్నారు. అంతలో లోపల నుండి కొన్ని మాటలు, చిన్నపిల్లాడి కేరింతలు వినిపించసాగాయి. పిల్లాడు కుయ్‌కుయ్ మని అరుస్తుంటే ఒక పెద్ద గొంతు మాత్రం "చుంగ్ చాంగ్ టింగ్ టాంగ్ చెంగ్ డింగ్ టాయ్ టాయ్ లపాంగ్ చెపాంగ్..." అనే పదాలతో ఆ పిల్లాడిని ముద్దు చేయసాగింది. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అర్ధంకానట్లు ముఖం పెట్టి... ఆ భాషేంటి, ఆ పిల్లాడ్ని ఆడించడమేంటి, మనం చిట్టి, పొట్టి, కన్నా, బంగారం అని ఆడిస్తుంటాం. మరి ఈ భాషేంటో, ఆ పదాలు పలుకుతున్నదెవరో అర్థమేకావడం లేదే అని అన్నాడు. అప్పుడు నారాయణ... ఇన్నేళ్ల నుండి ఆయన పక్కనే తిరుగుతున్నారు. ఆయన గొంతును గుర్తుపట్టలేక పోయారా? ఆ పిల్లాడిని ఆడిస్తున్నది మన చంద్రబాబుగారే! తన మనుమడిని ఆయన చైనా భాషలో ముద్దుగా ఆడిస్తున్నారు. ఎంతైనా చైనా వెళ్లొచ్చాడు కదా అని అన్నాడు. ముప్ఫై రోజుల్లో ఇంగ్లీష్, అరవం నేర్చుకోవడం చూసాం, మూడురోజుల్లోనే చైనా భాష నేర్చుకోవడమనేది మన చంద్రబాబు గారికే చెల్లిందని బొజ్జల కితాబిచ్చాడు. అంతలో చంద్రబాబు హాల్‌లోకి వచ్చాడు. అందరూ లేచి నిలుచున్నారు. అందరినీ కూర్చోమని చెప్పి ఆయన కూడా కూర్చున్నాడు. చంద్రబాబు మాట్లాడుతూ... నేను లేని ఈ నాలుగు రోజుల్లో రాష్ట్రంలో విశేషాలేంటని అడిగాడు. నారాయణ ఒక సిడిని తీసి ల్యాప్‌టాప్‌లో పెట్టి ఆన్ చేసి చంద్రబాబు ముందు పెట్టి, ఈ నాలుగురోజుల్లో మేం చేసిన పని చూడండి సార్ అన్నాడు.

★ ★ ★ ★ ★

ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి. అది తుళ్లూరులోని రాజధానికి ఎంపిక చేసిన భూములున్న ప్రాంతం. పచ్చటి పైర్లు ఉన్నాయి. నారాయణ తలపాగా చుట్టి ఓ వైపు ట్రాక్టర్ ఎక్కాడు. ఆయన వైపు 150ట్రాక్టర్లున్నాయి. ఇంకోపక్క పత్తిపాటి పుల్లారావు కూడా తలపాగా చుట్టి ట్రాక్టర్ ఎక్కాడు. ఆయన వైపు మరో 150ట్రాక్టర్ల దాకా వున్నాయి. ఈ రెండు టీమ్‌ల మధ్య పైర్లను తొలగిస్తూ భూమిని చదునుచేసే పోటీ మొదలైంది. నారాయణ, పుల్లారావులు ట్రాక్టర్లను పోటాపోటీగా నడుపుతున్నారు. వేగంగా పోనిస్తూ ట్రాక్టర్లను సినిమాల్లో మాదిరిగా గాల్లోకి లేపుతున్నారు. పంటలను తొక్కేస్తూ భూమిని చదును చేసే కొద్ది నారాయణలో ఉత్సాహం రెట్టింపు కాసాగింది. అలా మధ్యాహ్నం దాకా ట్రాక్టర్లను తోలాక మంత్రులిద్దరూ అక్కడే ఓ చెట్టుక్రింద కూర్చుని అరటి ఆకులలో భోజనం పెట్టుకుని తిన్నారు. తర్వాత మళ్లీ ట్రాక్టర్లను తోలే పనిలో పడ్డారు.

★ ★ ★ ★ ★

చంద్రబాబు ఇక్కడితో ఫైల్ క్లోజ్ చేసి ల్యాప్‌టాప్ మూసేసి... నారాయణ, పుల్లారావులను అభినందిస్తూ... వెరీగుడ్, రాజధాని కోసం మీరు బాగా కష్టపడుతున్నారు. ఈ మూడురోజుల్లో ఎన్ని ఎకరాలు దున్నేసారని అడిగాడు. 3రోజుల్లో 300ట్రాక్టర్లు పెట్టి 30ఎకరాలను దున్నేసామని నారాయణ చెప్పాడు. అలాగైతే ఈ సంవత్సరం ఆఖరికల్లా మొత్తం భూమిని చదును చేసేయగలరు. అంత వేగంగా భూమిని చదును చేయొద్దు. చదును పూర్తికాగానే రాజధాని నిర్మాణాన్ని మొదలు పెట్టాల్సి వుంటుంది. కాబట్టి రోజుకు ఒక ట్రెండు ఎకరాలు చదును చేస్తూపోండి చాలు. వచ్చే ఎన్నికల దాకా భూమిని చదును చేసే పనే పెట్టుకోండి, రాజధాని ఏది అని అడిగితే ఇంకా భూమి చదును పూర్తి కాలేదని చెప్పుకుంటుండొచ్చు. రాష్ట్రంలో కూడా మీరు చించే పనులేమీ లేవు. అక్కడే భూములు చదునుచేసుకుంటూ, కూలీలకు రోజూ కరెక్ట్‌గా లెక్క కట్టి డబ్బులిస్తుండడని చెప్పాడు. నారాయణ, పుల్లారావులిద్దరూ అందుకు సరేనన్నారు. తర్వాత సిఎం రమేష్, గల్లా జయదేవ్‌లు ఒలంపిక్ అసోసియేషన్ గొడవను చంద్రబాబు ముందు పెట్టారు. చంద్రబాబు వుండి.. కాంగ్రెస్ నుండి మన పార్టీలోకి వచ్చిన వారిని గౌరవించడం మన సంప్రదాయం. కాబట్టి కాంగ్రెస్ నుండి వచ్చిన గల్లా జయదేవ్‌కు ఆ పదవి ఇద్దాం. ఏమంటావ్ నారాయణ అని అడిగాడు. వెంటనే నారాయణ... అది కరెక్ట్ అన్న, నేను కూడా మా జిల్లాలో అదే ఫార్ములాను పాటిస్తున్నానని చెప్పాడు. దానికి సీఎం రమేష్ ఒప్పుకోలేదు. మీ ఫార్ములాను ఇంకెక్కడైనా అమలు చేసుకోండి, ఇక్కడ మాత్రం ఒప్పుకునేదే లేదని మొండికేయడంతో ఆ సంగతి తర్వాత తేలుస్తానని చంద్రబాబు వాయిదా వేసాడు. తర్వాత అశోక్ గజపతిరాజు అందుకుని... సార్, మీ విదేశీ పర్యటనలకు ఫ్లైట్ ఖర్చులు బాగా పెరిగిపోతున్నాయి. దానికి తగ్గ ఫలితం ఉంటుందో లేదో కూడా తెలియడం లేదు. మీరు సింగపూర్ వెళ్లొచ్చారు. రాష్ట్రాన్ని సింగపూర్ లాగా చేస్తామన్నారు. జపాన్, స్విట్జర్లాండ్ వెళ్లొచ్చాక రాష్ట్రాన్ని ఆ దేశాలు మాదిరిగా చేస్తామన్నారు. ఇప్పుడు చైనా వెళ్లొచ్చాక రాష్ట్రాన్ని చైనాలాగా చేస్తామంటున్నారు. ఇంతకీ రాష్ట్రాన్ని ఏ దేశంలాగా తయారు చేయాలనుకుంటున్నారని అడిగాడు. అప్పుడే ఏమైంది అశోక్ గజపతి గారు... ఇంకా తిరగాల్సిన దేశాలు చాలా వున్నాయి. అవన్నీ తిరిగాక ఏ దేశం లాగా తయారు చేయాలో డిసైడ్ చేస్తానన్నాడు. మీ విదేశీ పర్యటనలలో సోమాలియా, సిరియా, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలున్నాయా సార్ అని అశోక్‌గజపతిరాజు సందేహంగా అడిగాడు. చంద్రబాబు లేవని చెప్పాడు. దాంతో హమ్మయ్యా అంటూ అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అంతలో అక్కడ వంటవాళ్లు వచ్చి సార్, బ్రేక్‌ఫాస్ట్ రెడీ... రండి అని పిలిచారు. ఈరోజు మా ఇంట్లో అన్నీ చైనీస్ వంటకాలే, తిందురు రండి అని చంద్రబాబు ఆహ్వానించాడు. చైనీస్ అంటే చికెన్ ఫ్రైడ్‌రైస్, చిల్లీ చికెన్, చికెన్ 47 లాంటివి వుంటాయని అందరూ లొట్టలేసుకుంటూ డైనింగ్ టేబుల్ వద్దకు చేరారు. చంద్రబాబు చైనా నుండి వచ్చేటప్పుడే ఓ ఇద్దరు చైనీస్ వంటగాళ్లను వెంట తెచ్చుకున్నాడు. వాళ్లు డైనింగ్ టేబుల్ మీద వంటకాలన్నీ పలు రకాల పాత్రల్లో వేడివేడిగా పెట్టి వున్నారు. అందరూ ప్లేట్లు పట్టుకున్నారు. చైనీస్ వంటవాడు... ఓ పాత్ర తీసాడు, ఇవి న్యూడిల్సా అని దేవినేని ఉమ అడిగాడు. అందుకు చైనీస్ మాస్టర్... నో, ఇవి వానపాము న్యూడిల్స్ అని చెప్పాడు. అందరికీ వాంతి వచ్చినంత పనైంది. తర్వాత ఇంకో పాత్ర వద్దకు వెళ్లారు. పులుసు వాసన ఘుమఘుమలాడుతోంది. ఇది చేపల పులుసై వుంటుందని నారాయణ అన్నాడు. దానికి చైనీస్ మాస్టర్... నో, ఇది కప్పల పులుసు... ఆ పక్క పాత్రలో వుండేది పాము ఫ్రై, అవతలిదాన్లో వుండేది బొద్దింకల వేపుడు... అని అచ్చమైన చైనీస్ వంటకాలను చెప్పసాగాడు. ఆ పేర్లు వినగానే వాళ్లందరూ ప్లేట్లు అక్కడే వేసి... రాష్ట్రాన్ని చైనాలాగా మారుస్తానంటే ఈ విధంగానా అనుకుంటూ రాత్రి తిన్నది బయటకు తన్నుకొస్తుంటే కక్కడానికి బాత్రూంల వైపు పరుగులు తీసారు.

కదంబం

## అనేక మరణాలు

విహారి
హైదరాబాద్. 9848025600

స్వప్రయోజనం ఎప్పుడూ
నిలువెత్తు హింసావాది!
ఉనికి కోసం చేసే ఉద్ఘాటన
పరిపరి ఉపరి స్పర్శే
పొరలు త్రచ్చుతూ మూలాలకి
పోకపోవటం కళ్ళకు కమ్మిన పొర!
బోలు మాటల దొంతర్లలో
సత్యం హత్య చేయబడుతుంటే
రాజకీయం రంగుల వలని
విసురుతూనే వుంటుంది
ఇవ్వాళ పట్టుబడిన దౌష్ట్యం
నిన్న మట్టుబెట్టినవి ప్రాణాలు కావంటుంది!
దుర్మార్గపు 'నిబద్ధత' తన
చట్టం వేరంటుంది!
పావురాల్ని కొట్టేవాడు తనకు మాత్రమే
కన్నీళ్ళు కోరటం -- దయ్యపు అభ్యర్థన!
ఒకరి బతుకు పచ్చదనాన్ని
నిప్పచ్చరం చేసేవాడు
తన నీడనూ శిథిలం చేసే
కాల రహస్యాన్ని మరిస్తే...
'గీత'లూ, 'రాత'లూ --
కలగా పులగమై పోతాయి!

## వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి వైభవోపేతంగా జరుగనున్నాయి.

ఈ సందర్భంగా ఈ నెల 18న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆర్డీఓతో కలసి వివిధ శాఖల అధికారులతో సమావేశమై బ్రహ్మోత్సవ ఏర్పాట్లను చర్చించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు ఆదేశించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను ఈసారి మరింత వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి మాట్లాడుతూ, స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీన అంకురార్పణతో ప్రారంభమవుతాయని, 29న ధ్వజారోహణం, చప్పర ఉత్సవం, రాత్రికి శేష వాహనం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా, 30న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రికి హంసవాహనోత్సవం, మే1న చప్పర ఉత్సవం, రాత్రికి సింహవాహనోత్సవం, 2న చప్పర ఉత్సవం, రాత్రికి పూలంగి సేవ, హనుమంతసేవ నిర్వహిస్తామన్నారు. 3న మోహిని ఉత్సవం, అఖండజ్యోతి, మూలవర్లకు పూలంగిసేవ, అనంతరం బంగారు గరుడసేవ నిర్వహిస్తామని, 4న కల్యాణోత్సవం, గజవాహనోత్సవం, పూలంగిసేవ, 5న రథోత్సవం, 6న చప్పర ఉత్సవం, అశ్వవాహనోత్సవం, 7న తీర్థవాది, ధ్వజావరోహణ జరుగుతాయని, 8న ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మే 2,3,4 తేదీల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఈ సమావేశంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, ఎంపిడిఓ వసుమతి, గ్రామ సర్పంచ్ పెంచలయ్య, ఎంపిటిసి సభ్యుడు సునీల్‌కుమార్, ఆర్టీసి 2వ డిపో మేనేజర్ షమీమ్, రూరల్ ఎక్సైజ్ సిఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్‌కు వైద్య సేవలు



ఈ నెల 19వ తేదీన నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు హెల్త్ ఆడిట్‌లో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అపోలో స్పెషాలిటీ వైద్యులు, సిబ్బంది వచ్చి సభ్యులకు బి.వి., షుగర్, కొవ్వు వంటి 8రకాల పరీక్షలు నిర్వహించారు. మహిళా వాకర్స్‌కు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.శ్రీనివాసకుమార్, కార్యదర్శి బి.శేషగిరిరావు, కోశాధికారి టి.నారాయణరావు, రాఘవేంద్రశెట్టి, రంగారావు, అమరేంద్రరెడ్డి, సురేష్‌కుమార్, బి.సుందరరామిరెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, పి.దయాకర్‌రెడ్డి, ఎన్.బలరామయ్యనాయుడు, రామ్మోహన్, కెవిఆర్ విజయ, వి.నారాయణరావు, ఎల్లారెడ్డి, దశయ్య తదితరులు పాల్గొన్నారు.

- ముసవీర్ మరో అద్భుతం

## గోటిపై మస్తాన్ బాబు

నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు షేక్.ముసవ్వీర్ మరో అద్భుతాన్ని తయారు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. గోటిపై ఇమిడిపోయే సూక్ష్మమైన మల్లి మస్తాన్‌బాబు చిత్రాన్ని వెండితో తయారు చేసి నివాళి అర్పించారు. కేవలం 400 మి.గ్రా వెండితో 2సెం.మీ ఎత్తు, 1 సెం.మీ వెడల్పుతో మస్తాన్‌బాబు, జాతీయ పతాకం నమూనాను రూపొందించి గోటిపై ఉంచి ప్రదర్శించారు. దీనిని తయారు చేసేందుకు రెండు రోజులు సమయం పట్టిందని ముసవ్వీర్ తెలిపారు.

## పుట్టిన ఆసుపత్రి

# రుణం తీర్చుకుంటున్న జివికె



- నెల్లూరు సెయింట్ జోసఫ్స్ హాస్పిటల్‌కు చిరుకానుకగా 'రేడియాలజీ' విభాగం
- 25న ప్రారంభించనున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు

జన్మనిచ్చినందుకు తల్లిదండ్రులతో పాటు, పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు కృషి చేసేవారు ఎందరో వుంటారు. అయితే, వాటితో పాటు.. తాను పుట్టిన ఆసుపత్రి రుణం కూడా తీర్చుకునేందుకు సంకల్పించినవారు ఎంతైనా అరుదుగానే వుంటారు. అలాంటి విశిష్ట వ్యక్తిత్వం వున్న వ్యక్తి.. మానవతామూర్తి, జివికె ఫౌండేషన్ ఛైర్మెన్ డాక్టర్ జివికె రెడ్డి. నెల్లూరు సంతపేటలో వున్న సెయింట్ జోసఫ్స్ హాస్పిటల్‌లో 78ఏళ్ళ క్రితం ఆయన జన్మించారు. సేవాభావమే ఊపిరిగా పనిచేసే ఆసుపత్రి ఇది. నెల్లూరులో ఎందరో నిరుపేదలకు, అభాగ్యులకు నూరేళ్ళకు పైగానే వైద్యసేవలు అందిస్తూ ఎంతోమందికి ఊపిరిపోసిన కరుణామయి.. ఈ ఆసుపత్రి. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, నిస్వార్ధంగా ప్రజలకు నిరంతర సేవలందిస్తోన్న వైద్యశాల ఇది. నేటికీ, ప్రతి ఏడాదీ ఈ ఆసుపత్రిలో సుమారు 30వేల మందికిపైగా పేదలతో పాటు, మరో 4 వేల మందికిపైగానే రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఇక్కడ వైద్యసేవలు అందజేస్తున్నారు. ఇంతటి మహోన్నతమైన ఆసుపత్రికి ఈ నెల 25వ తేదీన డాక్టర్ జివికెరెడ్డి అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన రేడియాలజీ విభాగాన్ని ఒక చిరుకానుకగా సమర్పించబోతున్నారు. అంతేకాదు, ఈ విభాగానికి రెండు అపురూపమైన హీమో డయాలసిస్ మిషన్లను విరాళంగా అందజేయనున్నారు. వీటివల్ల ప్రతి నెలా ఉచితంగా డయాలసిస్ చికిత్స పొందే వందలాది మంది రోగులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుంది కూడా. దీంతోపాటు, ఆసుపత్రి అధికారులు మారుమూల గ్రామాలకు సైతం సునాయాసంగా ప్రయాణించేందుకు వీలుగా, పేదవారికి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించేందుకు అనువుగా జివికె ఫౌండేషన్ వారు ఒక స్కార్పియో వాహనాన్ని కూడా విరాళంగా అందివ్వనున్నారు.

దాదాపు 2కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో చేస్తున్న ఈ మహత్తరమైన కార్యక్రమానికి 25వ తేది ఉదయం 8.30 గంటలకు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం.వెంకయ్యనాయుడు విచ్చేసి సెయింట్ జోసఫ్స్ ఆసుపత్రిలో జివికె రేడియాలజీ విభాగానికి ప్రారంభోత్సవం చేయనున్నారు. డాక్టర్ జివికె రెడ్డితో పాటు, శ్రీ సుందరి సింగారెడ్డి, బిషప్ ఆఫ్ నెల్లూరు, ఆర్‌టి రెవరెండ్ బిషప్ ఎం.డి ప్రకాశం, జివికె ఫౌండేషన్ ట్రస్టీ జివి సంజయ్‌రెడ్డి, సెయింట్ జోసఫ్స్ హాస్పిటల్ కరస్పాండెంట్ ఎం.ఆర్ త్రెసా తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. 78 ఏళ్ళ క్రితం తాను జన్మించిన ఈ ఆసుపత్రికి తనవంతు సేవలందించాలని జివికె ఫౌండేషన్ ఛైర్మెన్ డాక్టర్ జివికెరెడ్డి సంకల్పించడం ఎంతో అరుదైన విశేషమే. అత్యాధునిక సిటీ స్కాన్ సిస్టమ్‌తో పాటు, అద్భుతమైన నాణ్యత గలిగిన చిత్రాలను




అందించే డిజిటల్ ఎక్స్‌రే ఫిల్మ్ ప్రింటర్ వగైరాలతో ఈ రేడియాలజీ విభాగాన్ని రూపుదుద్ది ఆసుపత్రికి సమర్పించడం ద్వారా జివికె తాను పుట్టిన ఆసుపత్రి రుణం తీర్చుకుంటూ తన జన్మను చరితార్ధం చేసుకోబోతున్నారు. మానవతా హృదయానికి మాతృక అయిన ఈ ఆసుపత్రిలో జన్మించిన జివికె కూడా ప్రజలకు వైద్యరంగంలో మహత్తరమైన సేవలందిస్తూ మహనీయమైన వ్యక్తిగా అందరి ప్రశంసలూ అందుకుంటూ వుండడం ఎంతైనా విశేషం. అటు నిర్భాగ్యులకు వైద్యసేవలందించే సెయింట్ జోసఫ్స్ ఆసుపత్రి, ఇటు సేవాభావానికి ప్రతీక అయిన డాక్టర్ జివికెరెడ్డి... ఇద్దరూ నెల్లూరు జిల్లాకే గర్వకారణంగా నిలిచినవారే.

### జిల్లాలోనూ మరెన్నో విశిష్టసేవలు :

జిల్లాలోనూ ప్రజలకు వైద్యసేవలందించేందుకు జివికె ఫౌండేషన్, జివికె వారు సూచించిన పలు సేవా కార్యక్రమాలను అంగీకరిస్తూ ఆసుపత్రి వారు ఈ సందర్భంగా ఒక అంగీకారానికి రావడం మరో విశేషం. ఆ మేరకు అందించే సేవల వివరాలిలా వున్నాయి. జివికె ఫౌండేషన్ వారు అసుపత్రికి అందిస్తోన్న స్వచ్ఛంధ విరాళాలకు ప్రతిస్పందనగా ఆసుపత్రి వారు, జివికె చిన్మయ విద్యాలయ, మరియు గునుపాటి రుక్మిణమ్మ సుబ్బరామిరెడ్డి జడ్పీహెచ్ స్కూల్ (కొత్తూరు), విద్యార్థులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించేందుకు అంగీకరించారు. ఆసుపత్రివారు కొత్తూరు గ్రామంలోనూ, నెల్లూరు జిల్లాలోని సమీప గ్రామాల్లోనూ ప్రజలందరికీ ప్రతి నెలా ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహించి, ఉచిత వైద్యసేవలందిస్తారు. కొత్తూరులో ఆసుపత్రివారు ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహించేందుకు, జివికె ఫౌండేషన్‌వారు అవసరమైన సంపూర్ణ సహకారం అందజేస్తారు. ఆసుపత్రివారు, పైన పేర్కొన్న వైద్యపరీక్షలు, వైద్యశిబిరాల నిర్వహణలో ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా కనీసం ఒక క్వాలిఫైడ్ డాక్టర్, ఇద్దరు టెక్నీషియన్లు, ఒక నర్సు, మరియు ఆసుపత్రి నుంచి అవసరమైన సామగ్రిని ఉచితంగా పంపాల్సివుంటుంది. వైద్యపరీక్షలు, వైద్యశిబిరాల నిర్వహణలో ఆసుపత్రి వారు, విద్యార్థులు, లేదా గ్రామస్తులకు వీలైనంత మేరకు మందులు లేదా వ్యాక్సిన్లు పూర్తిగా ఉచితంగానే అందించడానికి తమ అంగీకారం తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

అంతేకాక, ఒకవేళ అంటువ్యాధులు తీవ్రంగా ప్రబలినప్పుడు, అత్యవసర సమయాల్లోనూ పాఠశాల, లేదా గ్రామాలను అదనంగా సందర్శించి ఉచితంగా మందులు, వ్యాక్సిన్లు అందజేస్తారు. కాగా, జివికె ఫౌండేషన్ వారు ఆసుపత్రికి అనుబంధంగా నడిచే తెలుగు మీడియం అన్‌ఎయిడెడ్ స్కూల్‌లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే లక్ష్యంతో 15 డెస్క్‌టాప్ కంప్యూటర్లను బహుకరించినట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

తాను పుట్టిన ఆసుపత్రికి, తన జన్మభూమికి, తన సొంత జిల్లాకే కాకుండా దేశ వ్యాప్తంగా కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జి.వి.కె. ధన్యులు!






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com